జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php




సంపుటి 12 సంచిక 224 విశాఖపట్నం | శనివారం 01 మే 2021 | 8 పేజీలు | వెల : 5.00

# నాడు-నేడుపై జగన్ సమీక్ష

- ◆నాడు-నేడు మనబడి పనుల్లో పూర్తి నాణ్యత పాటించాలి
- ◆అన్ని స్కూళ్ల పనుల్లో నాణ్యతను తనిఖీ చేయాలి
- ◆మే చివరి నాటికి నాడు-నేడు మొదటి దశ పనులు పూర్తవ్వాలి
- ◆జూలైలో స్కూళ్లు తెరిచే నాటికి విద్యా కానుక కిట్లు సిద్ధం చేయాలి
- ◆విద్యార్థుల మంచి కోసమే పరీక్షల నిర్వహణ



అమరావతి,ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: నాడు-నేడు (పాఠశాల విద్యాశాఖ)పై క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. నాడు-నేడు మనబడి మొదటిదశలో 15,715 స్కూళ్లలో చేపట్టిన పనుల పురోగతిని సీఎం జగన్ క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. పనులు దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నాయన్న అధికారులు, ఆ వివరాలను ప్రజెంటేషన్‌లో చూపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. "రూపురేఖలు మార్చుకుంటున్న స్కూళ్లు మరింత ఆకర్షణీయంగా కనిపించేలా పాఠశాలల గోడలకు వేసినట్లు, బిల్డింగ్‌పై కూడా పెయింటింగ్స్ వేయండి. నాడు-నేడు పనులు పూర్తయ్యాక, ప్రతి స్కూల్‌లో నాడు ఆ స్కూల్ ఎలా ఉంది.. ఇప్పుడెలా ఉంది అన్న ఫోటోలు తప్పనిసరిగా ప్రదర్శించాలి. అప్పుడే ఇప్పుడు చేసిన పనులకు మరింత విలువ వస్తుంది. వాటి ప్రాధాన్యత తెలుస్తుంది. అదే విధంగా ఇప్పుడు ఆ స్కూల్‌ను ఎలా నిర్వహించాలన్న దానిపైనా వారికి అవగాహన కలుగుతుంది" అన్నారు. "స్కూళ్లలో పెయింటింగ్ పనులు, స్మార్ట్ టీవీలు, వాల్ ఆర్ట్‌తో సహా అన్ని పనులు తప్పనిసరిగా మే చివరి నాటికి పూర్తి కావాలి .పనుల నాణ్యతలో ఎక్కడా లోపం ఉండకూడదు. అందుకే పేరెంట్స్ కమిటీలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. నాడు-నేడులో ప్రభుత్వం నిర్దేశించుకున్న విధంగా పనులు జరగాలి. వాటిలో ఎక్కడా తేడా ఉండకూడదు. అలాగే మే, జూన్ నెలల్లో పూర్తిగా పనులు నాణ్యతను చూడాలి. ప్రతి స్కూల్ సందర్శించాలి. అన్నీ నోట్ చేయాలి. క్వాలిటీ ఆడిట్ పూర్తి కావాలి. టాయిలెట్ నిర్వహణ వ్యవస్థ కూడా స్కూళ్లు తెరిచే నాటికి పూర్తి కావాలి" అని తెలిపారు. ''ఇంగ్లిష్ మీడియమ్‌లో బోధన సజావుగా జరిగేలా టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. అప్పుడే వారు ఏ ఇబ్బంది లేకుండా ఇంగ్లిష్‌లో పాఠాలు చెప్పగలుగుతారు. పిల్లలు స్కూళ్లకు వచ్చే నాటికే విద్యా కానుక కూడా రెడీ కావాలి. ఈసారి కిట్లలో ఇంగ్లిష్ డిక్షనరీ కూడా తప్పనిసరిగా ఉండాలి. విద్యా కానుక కింద ఇస్తున్న కిట్లలో ప్రతి ఒక్కటీ పూర్తి నాణ్యత కలిగి ఉండాలి. జూలైలో స్కూళ్లు తెరవగానే, నాడు-నేడు మనబడి రెండో దశ పనులు మొదలు కావాలి" అని **(మిగతా 2లో..)**



## కరోనా సమయంలో పరీక్షలు పెట్టడం కరెక్టా: హైకోర్టు న్యాయవాది

విజయవాడ, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: ఇంటర్, టెన్త్ పరీక్షలపై ఏపీ హైకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇంటర్ పరీక్షలపై ప్రభుత్వం పున:పరిశీలన చేసుకోవాలని హైకోర్టు సూచించింది. పిటిషనర్ల తరపున సీనియర్ కౌన్సిల్ చేసిన వాదనలో.. చాలా అంశాలు ముడిపడి ఉన్నాయని కోర్టు అభిప్రాయపడింది. దాదాపు 30 లక్షల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు.. పరీక్షల్లో భాగం కావాల్సి ఉందని పేర్కొంది. అందువల్ల ప్రభుత్వం వెంటనే పున:పరిశీలన చేసుకోవాలని సూచించింది. కేసు విచారణను హైకోర్టు మే 3వ తేదీకి వాయిదా వేసింది. అదే రోజు ప్రభుత్వ అభిప్రాయం చెప్పాలని ఆదేశించింది. మే 2లోపు ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కొవిడ్ వచ్చిన విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనల ప్రకారం హోం ఐసోలేషన్‌లో ఉండాలి కదా? అని ప్రభుత్వాన్ని నిలదీసింది. వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారని... అదెలా సాధ్యమవుతుందని ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. కొవిడ్ వచ్చిన వారు మానసికంగా పరీక్ష రాయగలుగుతారా? అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇతర రాష్ట్రాల్లో పరీక్షలు వాయిదా లేదా రద్దు చేసిన విషయంతో పాటు.. రాష్ట్రంలో కేసులు పెరుగుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది.

## మీ అంతట మీరు రెమ్‌డెసివిర్ తీసుకోవద్దు: ఎయిమ్స్ చీఫ్



న్యూఢిల్లీ,ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:కరోనాకు ఇంట్లో ఉండి చికిత్స తీసుకుంటున్న వారు యాంటీవైరల్ ఇంజక్షన్ రెమ్‌డెసివిర్‌ను తీసుకోవద్దని ఎయిమ్స్ చీఫ్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా సూచించారు. నేడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రెమ్‌డెసివిర్‌ను తీవ్రంగా ఉన్న కేసుల్లో మాత్రమే ఇస్తామని, కాబట్టి ఇంటి వద్ద ఉండి చికిత్స తీసుకుంటున్న వారు దానిని తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రెమ్‌డెసివిర్‌ను వైద్య నిపుణుడి సమక్షంలో ఆసుపత్రిలో మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కరోనా సోకి హోం ఐసోలేషన్‌లో ఉన్నవారు దాని నుంచి ఎప్పుడు బయటకు రావాలన్న ప్రశ్నకు డాక్టర్ గులేరియా స్పందిస్తూ.. లక్షణాలు లేకుండా కనీసం పది రోజులు గడిచిన తర్వాత, మూడు రోజులపాటు ఎలాంటి జ్వరం లేకుంటేనే హోం ఐసోలేషన్‌ను విడిచిపెట్టాలన్నారు. హోం ఐసోలేషన్ గడువు ముగిసిన తర్వాత మళ్లీ పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం లేదన్నారు. డాక్టర్ సలహా మేరకే సిస్టమాటిక్ స్టెరాయిడ్స్‌ను వేసుకోవాలని డాక్టర్ గులేరియా వివరించారు.

## కరోనా సమాచారం.. రాష్ట్రాలకు సుప్రీంకోర్టు వార్నింగ్



న్యూఢిల్లీ,ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: దేశవ్యాప్తంగా శనివారం నుంచి మూడోదశ కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యాక్సిన్ల ధరలపై కేంద్రాన్ని నిలదీసింది సుప్రీంకోర్టు. ఒకే వ్యాక్సిన్‌కు రెండు ధరలు ఎందుకని ప్రశ్నించింది. ఉత్పత్తి అయిన వ్యాక్సిన్లు అన్నింటినీ కేంద్రమే ఎందుకు కొనుగోలు చేయడం లేదు? కేంద్రానికి, రాష్ట్రాలకు రెండు ధరలు ఎందుకు? ఇందులో హేతుబద్ధత ఏంటి అని శుక్రవారం కేంద్రాన్ని ప్రశ్నించింది అత్యున్నత న్యాయస్థానం. వ్యాక్సిన్ ధరల అంశం అనేది చాలా తీవ్రమైనది. కేంద్రానికి వచ్చిన వ్యాక్సిన్లలో 50 శాతం ఫ్రంట్‌లైన్ వర్కర్లకు, 45 ఏళ్ల పైబడిన వాళ్లకు ఇస్తామన్నారు. మిగతా 50 శాతం రాష్ట్రాలు వాడుకోవచ్చన్నారు. 59.46 కోట్ల మంది భారతీయులు 45 ఏళ్ల లోపు వాళ్లే. వీళ్లలో చాలా మంది నిరుపేద, అణగారిన వర్గాలే. వాళ్లు వ్యాక్సిన్లకు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారు అని కేంద్రాన్ని సుప్రీం కోర్టు నిలదీసింది. 18-44 ఏళ్ల వయసు వారికి ప్రభుత్వమే వ్యాక్సినేట్ చేయడం చాలా ముఖ్యమని వ్యాఖ్యానించింది. ఎన్ని వ్యాక్సిన్లు ఉత్పత్తి అవుతున్నాయో మాకు తెలుసు. మీరు ఉత్పత్తిని పెంచేలా చూడాలి. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వ్యాక్సిన్ల ఉత్పత్తిని పెంచాల్సిందే అని కోర్టు స్పష్టం చేసింది.

రాష్ట్రాలకు వార్నింగ్
ఇక రాష్ట్రాలకు కూడా సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరికలు


**(మిగతా 2లో..)**



## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మోగుతున్న డేంజర్ బెల్స్

విజయవాడ,ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. మచిలీపట్నం జిల్లా ఆసుపత్రిలో బాడీ బ్యాగ్స్ కొరత భారీగా ఉంది. కరోనా మృతదేహాలను భద్రపరచడానికి సిబ్బంది అవస్థలు పడుతున్నారు. కనీసం బ్యాగులు కూడా లేకపోవడంతో.. అలాగే వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. మార్చురీలలో మృతదేహాలు పేరుకు పోతున్నాయి. అవసరాలకు తగ్గట్లుగా నిల్వలను ఏర్పాటు చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. వెంటనే చర్యలు చేపట్టి.. అవసమైన ఏర్పాట్లు చేయాలని రోగుల బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## భారత్‌కు చేరిన అమెరికా అత్యవసర సాయం



న్యూఢిల్లీ,ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా సెకండ్ వేవ్‌తో భారత్ పోరాడుతున్నది. రోజు రోజుకు పెరుగుతున్న కేసులతో సంక్షోభం నెలకొన్నది. ఈ క్రమంలో పలు దేశాలు ముందుకు వచ్చి సాయం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే చాలా దేశాలు వైద్య పరికరాలు, ఇతర అవసరమైన సామగ్రిని పంపాయి. అగ్రరాజ్యం అమెరికా సైతం వంద మిలియన్ డాలర్ల సాయం ప్రకటించగా.. ఈ క్రమంలో శుక్రవారం అమెరికా నుంచి భారత్ తొలి కొవిడ్ అత్యవసర సహాయ సామగ్రిని అందుకున్నది. 400కి పైగా ఆక్సిజన్ సిలిండర్లు, దాదాపు ఒక మిలియన్ ర్యాపిడ్ కరోనావైరస్ టెస్ట్ కిట్లు, ఇతర పరికరాలతో, సూపర్ గెలాక్సీ మిలిటరీ ట్రాన్స్‌పోర్టర్ ఇవాళ ఉదయం ఢిల్లీ అంతర్జాతీయ విమానంలో దిగింది.

భారత్‌కు చేరిన అమెరికా అత్యవసర సాయం

ఈ మేరకు యూఎస్ ఎంబసీ భారతదేశానికి తాము సహాయం చేస్తామని ఇచ్చిన మాట మేరకు సహాయం అందిస్తున్నామని, సహాయానికి సంబంధించిన ఫొటోలను షేర్ చేసింది. 'యునైటెడ్ స్టేట్స్ నుంచి అనేక అత్యవసర కొవిడ్-19 సహాయక సరుకులలో మొదటిది భారతదేశానికి చేరుకుంది. 70 సంవత్సరాల పరస్పర సహకారంతో, యునైటెడ్ స్టేట్స్ భారతదేశంతో నిలుస్తుంది. మేము సమిష్టిగా కొవిడ్-19 మహమ్మారితో పోరాడుతాం' అంటూ ట్వీట్ చేసింది. యూఎస్ ఎంబసీ హ్యాష్‌ట్యాగ్ ఇచ్చింది.

అమెరికా నుంచి వచ్చిన వాటిల్లో వెయ్యి ఆక్సిజన్ సిలిండర్లు, 1.50కోట్ల ఎన్-95 మాస్కులు, పది లక్షల ర్యాపిడ్ టెస్ట్ కిట్స్, ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్ తయారీకి సంబంధించి ముడి సరుకు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. యూఎస్‌లోని వివిధ కంపెనీలు మరియు వ్యక్తులు విరాళంగా ఇచ్చే పరికరాలను కూడా తీసుకువచ్చే ప్రత్యేక విమానాలు వచ్చే వారంలో కూడా కొనసాగుతాయని అమెరికా అధికారులు తెలిపారు. ఈ వారం ప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ **(మిగతా 2లో..)**



# బెజవాడ టీడీపీలో పట్టింపులు...

విజయవాడ, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:బెజవాడ రాజకీయాల్లో తనకంటూ.. ప్రత్యేకతను సంతరించుకున్న నాయకుడు.. మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా సైలెంట్ అయిపోయారు. అదే సమయంలో ఏకైక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కూడా మౌనం పాటిస్తున్నారు. మరి ఎందుకు ? ఇలా జరుగుతోంది? ఇటీవల జరిగిన స్థానిక, కార్పొరేషన్ ఎన్నికల్లో దూకుడుగా వ్యవహరించిన నాయకులు.. ఇప్పుడు పూర్తిగా మౌనం పాటిస్తున్నారు. స్థానిక ఎన్నికల సమయంలో విజయవాడలో వైసీపీ గెలిస్తే.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని బొండా ఉమా వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఎంపీ కేశినేని నానిపై విరుచుకుపడ్డారు. ఇక, కార్పొరేషన్ ఎన్నికల కీలక సమయంలో ఎంపీ కేంద్రంగా సాగిన వివాదంలో బొండా ఉమా తీవ్రంగానే స్పందించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ వివాదంలో వేలు పెట్టకపోయినా.. ఎన్నికల్లో మాత్రం ఆశించిన విధంగా స్పందించలేదనే టాక్ ఉంది. సరే! ఇప్పుడు ఎన్నికలు ముగిశాయి. కానీ.. నేతలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. పార్టీ తరఫున వాయిస్ వినిపించేవారు కూడా తెరమరుగు కావడంతో పార్టీలో నిస్తేజ పూరిత వాతావరణం ఏర్పడింది. మరోవైపు.. టీడీపీ పూర్తిగా భూస్థాపితం అయిపోయిందనే వ్యాఖ్యలు వైసీపీ వర్గాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. వైసీపీ సోషల్ మీడియాలో టీడీపీపై పెద్ద ఎత్తున వ్యతిరేక కామెంట్లు ప్రచారం జరుగుతున్నా యి. అయినప్పటికీ.. ఫైర్ బ్రాండ్ నాయకుడుగా పేరుతెచ్చుకున్న బొండా ఉమా కానీ, గద్దె రామ్మోహన్ కానీ.. ఎవరూ స్పందించడం లేదు. ఏ ఒక్కరూ వీటిపై కామెంట్లు చేయడం లేదు. దీంతో పార్టీలో కార్యకర్తల మధ్య కూడా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. అయితే.. దీనివెనుక పార్టీ అధినేత చంద్రబాబు కారణమని బొండా ఉమ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీ కేశినేనినానితో కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఏర్పడిన వివాదం.. సవాళ్లు ప్రతిసవాళ్ల విషయాన్ని చంద్రబాబు పట్టించుకోలేదని.. ఎంపీవైపే ఉన్నారని.. బొండా ఉమ వర్గాలు పేర్కొంటున్నాయి. పైగా.. ఎక్కడా బొండాను సర్దుబాటు చేసే ప్రయత్నం కూడా చేయలేదని, కేవలం ఎంపీ నాని వైపే చంద్రబాబు నిలబడ్డారని.. బొండా అనుచరులు చెబుతున్నారు. దీంతో బొండా ఉమా.. అసలు నగరంలోనే లేరని అంటున్నారు. ఇంత వరకు బాగానే మరి గద్దె రామ్మోహన్ మౌనం వెనుక ఏం జరిగింది? ఆయనెందుకు మౌనంగా ఉన్నారు? అనేది మాత్రం తెలియాల్సి ఉంది. కార్పొరేషన్ ఎన్నికలకు ముందు మేయర్ పీఠాన్ని ఆశించినా.. దక్కలేదు. ఈ కారణంగానే ఆయన మౌనంగా ఉన్నారా? అలా అయితే.. అసలు పార్టీనే ఓడిపోయిన నేపథ్యంలో ఇప్పుడు ఇంకా అవే పంతాలు ఎందుకు? అనే ప్రశ్న తెరమీదికి వస్తోంది. ఏదేమైనా.. పంతాలు.. పట్టింపులతో పార్టీని నాశనం చేస్తున్నారనే వాదన వస్తుండడం గమనార్హం.

# ఆపరేషన్ ఆకర్ష్ ....!

విశాఖపట్టణం, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:ఏపీలో మళ్లీ రాజకీయ కప్పగెంతులకు టైమ్ వచ్చేసినట్లుగా ఉంది. ఢీ అంటే ఢీ కొడుతున్న టీడీపీని చాలా వరకూ ఎన్నికలలో ఓడించడం ద్వారా దెబ్బతీసిన వైసీపీ ఇపుడు ఓడి వాడిన పసుపు శిబిరం పస తేల్చే పనిలో పడిందంటున్నారు. ఏపీలో రాజకీయంగా బలంగా వైసీపీ ఉంది. మరో మూడేళ్ల వరకూ అధికారానికి ఎలాంటి ఢోకా లేదు. ఈ సంగతి చంద్రబాబు కావాలని విస్మరించినా తమ్ముళ్లకు తెలియనిది కాదు. సరిగ్గా ఈ పాయింట్ నే ఆసరాగా చేసుకుని టీడీపీకి గట్టి షాక్ ఇవ్వడానికి వైసీపీ రెడీ అయిపోయింది. టీడీపీ ఓడినా బలమైన నేతలు ఇంకా ఆ పార్టీఎని పట్టుకుని ఉన్నారు. వారు ఇప్పటిదాకా అనుకున్నది వేరు జరుగుతున్నది వేరు అన్నట్లుగా పొలిటికల్ సీన్ ఉంది. రాజకీయాలల్లో ఒక పార్టీ గెలిస్తే మరో పార్టీ ఓడడం కామన్. మరో ఎన్నికలో టీడీపీ వస్తుంది అన్న నమ్మకం అయితే నిన్నటిదాకా ఉండేది, ఇటు సొంత టీడీపీలో చూస్తే చంద్రబాబు పోరాట పటిమ మీద డౌట్లు వచ్చేస్తున్నాయి. భావి నేతగా లోకేష్ ఎదగలేకపోతున్నారు. ఈ మధనమే ఇపుడు వారిని పక్క చూపులు చూడాల్సిన పరిస్థితిని కల్పిస్తోందని అంటున్నారు. ఈ నేపధ్యం రాజకీయంగా తమకు కలసివస్తుందని వైసీపీ నాయకత్వం అభిప్రాయపడుతోంది. దీంతో వైసీపీ నుంచి కొందరు కీలకమైన నేతలను బరిలోకి దింపి మరీ ఆపరేషన్ ఆకర్ష్ కి తెర తీస్తున్నారు అని ప్రచారంలో ఉంది. ఉత్తరాంధ్ర విషయానికి వస్తే సీనియర్ మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలోని టీడీపీ నేతలకు గేలం వేస్తున్నారు అంటున్నారు. ఆయన ఏకంగా ఏపీ టీడీపీ మాజీ ప్రెసిడెంట్ కళా వెంకటరావుని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని టాక్ నడుస్తోంది. కళా ఫ్యామిలీ చాలా పెద్దది, పైగా రెండు జిల్లాలలో కలుపుకుని మూడు నాలుగు అసెంబ్లీ సీట్లలో వారి ప్రభావం ఉంది. దాంతో పాటు సొంత సామాజికవర్గం కూడా కావడంతో కళాను బొత్స వైసీపీలోకి తీసుకురావాలనుకుంటున్నారుట. విశాఖను వైసీపీకి కంచుకోటగా మార్చే పనిలో విజయసాయిరెడ్డి బిజీగా ఉన్నారని అంటున్నారు. ఆయన గేలానికి ఒక టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్సీ ఇప్పటికే చిక్కారని ప్రచారం సాగుతోంది. ఆయన గత కొంత కాలంగా టీడీపీ అధినాయకత్వం పోడకల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అంటున్నారు. ఆయనతో పాటు మరికొంతమంది మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల మీద కూడా సాయిరెడ్డి గురి పెట్టారని అంటున్నారు. వీరంతా వస్తే కనుక విశాఖ జిల్లాలో టీడీపీ కి అతి పెద్ద బ్రేకులు పడిపోతాయని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# అవంతికి అప్పన్నే దిక్కు



విశాఖపట్టణం, ఏప్రిల్ 30, :అసలే ఆయనలో భక్తి పాలు చాలా ఎక్కువ. ఊసుకు వస్తే చాలు దేవాలయాల్లోనే ఉంటారు. ఇపుడు ఆ భక్తి కాస్తా మరింత పీక్స్ కి చేరింది అంటున్నారు. ఆయన ఎవరో కాదు విశాఖ జిల్లాకు చెందిన మంత్రి అవంతి శ్రీనివాసరావు. లోకల్ బాడీ ఎన్నికలు కాదు కానీ ప్రశాంతంగా ఉన్న అవంతిలో అశాంతిని నిండా పెంచాయని అంటున్నారు. జగన్ మాటే వేదంగా భావిస్తూ అవినీతికి దూరంగా ఉంటూ వస్తున్న అవంతి శ్రీనివాసరావుకి ఇప్పటిదాకా మంచి మార్కులే పడ్డాయి. వివాదాలకు దూరంగా ఉంటూ తన పనేంటో తానేంటో అన్నట్లుగా వ్యవహరించే అవంతికి తాజాగా జరిగిన లోకల్ బాడీ ఎన్నికల ఫలితాలు భారీ స్ట్రోక్ ఇచ్చేశాయి. తెలుగుదేశం పార్టీ కంచుకోటలో విజయపతాకను ఎగరేసిన అవంతి శ్రీనివాసరావుకి రెండేళ్ళు తిరగకుండానే భిమిలీ చుక్కలు చూపించింది. పంచాయతీ ఎన్నికల్లో కూడా సైకిల్ జోరు బాగానే ఉంటే మునిసిపల్ ఎన్నికల నాటికి అది స్పీడ్ అందుకుంది. ఏకంగా భీమిలీలో ఏడు వార్డుల్లో రెండే రెండు వైసీపీకి దక్కాయి అంటే అవంతి కి అదే పెద్ద మైనస్ పాయింట్ అయింది అంటున్నారు. ఇక జరిగింది పొరొపాటో మరోటో చెప్పుకోవడానికి కూడా లేకుండా కూతురు పోటీ చేసింది అంటున్నారు. సొంత కుమార్తె కోసం పార్టీకి గాలికి వదిలేసారు అన్నది ఇపుడు అవంతి శ్రీనివాసరావు మీద హైకమాండ్ కి చేరిన ఫిర్యాదు. లోకల్ బాడీ ఫలితాలలో అవంతి శ్రీనివాసరావు సత్తా చూపిస్తే కచ్చితంగా ఆయన అయిదేళ్ళ మంత్రే అన్న మాట కూడా ఉంది. ఎందుకంటే విశాఖ అర్బన్ జిల్లాలో ఆయనను మించిన నేత మరొకరు లేరు. సిటీలో నాలుగు సీట్లు టీడీపీ ఎమ్మెల్యేలే గెలవడం కూడా అవంతికి పొలిటికల్ గా కలసివచ్చింది. కానీ ఇపుడు భీమిలీతో ఓటమితో పాటు విశాఖ కార్పొరేషన్ లో బొటా బొటీ మెజారిటీ వైసీపీకి దక్కడం వెనక ఫెయిల్యూర్ లో మంత్రి వాటా కూడా ఉందని హై కమాండ్ అంటోంది. దాంతో ఇక మినిస్టర్ పోస్ట్ పోయినట్లే అన్న చర్చ అయితే వైసీపీలో ఉంది. అవంతి శ్రీనివాసరావుకి విపరీతమైన భక్తి. ఆయన నియోజకవర్గంలోనే సింహాచలం కూడా ఉంది. అవంతి తరచూ అప్పన్నను దర్శించుకుం టారు. లోకల్ బాడీ ఎన్నికల తరు వాత ఆయన మరింత ఎక్కువగా అప్పన్న సేవలో తరిస్తున్నారు. ఇది దేవాలయ అధికారులతో పాటు అందరికీ ఆశ్చర్యంగానే ఉంది. అయితే అవంతి తన రాజకీయ జీవితంలో ఎపుడు ఇబ్బందులు వచ్చినా కూడా అప్పన్నకు మొక్కులు చెల్లించి మరీ వాటి నుంచి బయటకు వస్తూంటారు. మరి ఈసారి వచ్చిన ఆపదకు అప్పన్న అడ్డుకట్ట వేస్తారా. అవంతి పోస్టింగ్ ఊస్టింగ్ కాకుండా కాపాడుతాడా అన్న చర్చ వైసీపీలో గట్టిగా సాగుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# జగన్‌ను దారిలోకి తెచ్చే పనిలో కమలం

గుంటూరు, ఏప్రిల్ 30, :ఏపీలో ఎదగాలన్నది బీజేపీ ఆశ. ఆలోచన. దానికి ఎప్పటి నుంచో పావులు కదుపుతూ వస్తోంది. దేశమంతా వాజ్ పేయికి జై కొట్టినా కూడా ఏపీ జనాలు ఉలకలేదు, పలకలేదు. ఇక మోడీ వేవ్ భయంకరంగా 2014 ఎన్నికల వేళ దేశంలో వీచింది. అయినా కూడా ఏపీ పొలాల్లో ఎక్కడా కమలం విత్తనాలు మొలవలేదు. ఇపుడు కాకమెరెప్పుడు అన్న కసి అయితే బీజేపీలో నానాటికీ పెరిగిపోతోంది. అన్నీ ప్రయోగాలూ అయిపోయిన వేళ ఏపీలో కమల విలాపమే మిగిలింది. ఇక తిరుపతి ఫలితం విషయంలో బీజేపీ ఒక అంచనా వేసుకుంది. కనీసంగా లక్షన్నర ఓట్లు అయినా రావాలి అన్నది బీజేపీ ఆలోచన. అవి తగ్గి ఏ యాభై వేలకో పడిపోతే మాత్రం బీజేపీ చూస్తూ ఊరుకోదు అంటున్నారు. ఏపీని నయానో భయానో దారికి తెచ్చుకోవడానికే పక్కా ప్లాన్ తో ముందుకు దూకుతుంది అని అంటున్నారు. ఏపీలో జనాలు బీజేపీ వైపు మొగ్గు చూపకపోతే పోవచ్చు కానీ రాజకీయం మాత్రం తనకు అనుకూలంగానే ఉంటుందని బీజేపీ నమ్ముతోంది. రెండు బలమైన ప్రాంతీయ పార్టీల అధినేతల బలహీనతలే పెట్టుబడిగా బీజేపీ సరికొత్త రాజకీయానికి తెర తీసే అవకాశాలు కూడా కొట్టిపారేయలేమం అంటున్నారు. ఇప్పటికే కేంద్రంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమికి బీటలు వారాయి. తాజాగా మరో పార్టీ కూడా బయటకు వచ్చేసింది. దాంతో 2024 ఎన్నికలు బీజేపీ కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. అందువల్ల జగన్ మీద బీజేపీ తీవ్ర వత్తిడి పెట్టే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. జగన్ ని కేంద్రంలోని కూటమిలో చేరాలని ఇక మీదట టార్చర్ పెట్టినా ఆశ్చర్యపోనవసరం లేదని కూడా అంటున్నారు. జగన్ తన రాజకీయ లాభనష్టాలను బేరీజు వేసుకుని నో చెబితే మాత్రం బీజేపీ విశ్వరూపమే చూడాల్సి ఉంటుందని కూడా ఢిల్లీ వార్తలు చెబుతున్న సమాచారం. తిరుపతి ఉప ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత ఏపీ రాజకీయాల్లో సంచలనాలే నమోదు అవుతాయని అంటున్నారు. బీజేపీ ఎకాఎకిన టీడీపీతో పొత్తు కలిపేసి వారి పక్కన చేరుతుంది అన్నది ఇప్పట్లో జరిగేది కాదని అంటున్నారు. బీజేపీ ఫస్ట్ ప్రయారిటీ వైసీపీయే అంటున్నారు. జగన్ నే నయానో భయానో దారికి రప్పించుకోవాలన్నదే బీజేపీ అజెండా అని చెబుతున్నారు. జగన్ ఈ విషయంలో మొండిగా వ్యవహరించినా లేక బీజేపీకి దూరం పాటించినా కూడా ఏపీ రాజకీయాల్లో భారీ తేడాలు వస్తాయని కూడా అంచనా వేస్తున్నారు. బీజేపీతో కలసి అడుగులు వేయకపోతే కేంద్ర పెద్దలు ఇక మీదట చూస్తూ ఊరుకోరని, దానికి తగిన కాషాయ మంత్రాంగాన్ని రెడీ చేసి పెట్టారని ఢిలీ కబురు మోసుకొస్తున్న వర్తమానం. మొత్తానికి జగన్ కి ముందు నుయ్యి వెనక గొయ్యి అన్నట్లుగా బీజేపీ తో వ్యవహారం ఉండబోతోంది అన్నది ఒక విశ్లేషణ. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## భారత్‌కు చేరిన అమెరికా అత్యవసర సాయం

(మొదటి పేజీ తరువాయి)

కొవిడ్‌కు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో భారతదేశానికి నిరంతర మద్దతు ప్రకటించారు. 'అమెరికాలో వైరస్ విజృంభించిన సమయంలో భారత్ మా పక్షాన నిలబడింది. ఇప్పుడు భారత్‌కు అవసరం వచ్చింది. మేం భారత్ పక్షాన నిలబడాలనే దృఢ సంకల్పం తీసుకున్నాం' అని బైడెన్ పేర్కొన్నారు.

## నాడు-నేడుపై జగన్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

సీఎం జగన్ అధికారులను ఆదేశించారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసమే టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణ కాగా, ఈ సమీక్షలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను కూడా సీఎం జగన్ ప్రస్తావించారు.

ఎందుకు అన్నది చెప్పాలి:

"ఏ పరిస్థితిలో ఎందుకు పరీక్షలు పెడుతున్నామన్నది చెప్పాలి. నిన్న కేరళలో 10వ తరగతి పరీక్షలు పూర్తి చేశారు. పదవ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై కేంద్రం ఏ విధానాన్ని ప్రకటించలేదు. నిర్ణయాన్ని రాష్ట్రాలకే వదిలేసింది. దాంతో రాష్ట్రాలు స్వయంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయి. కొన్ని రాష్ట్రాలు పరీక్షలు నిర్వహిస్తుండగా, మరి కొన్ని రాష్ట్రాలు పరీక్షలను రద్దు చేశాయి" అన్నారు.

పరీక్షలతో కలిగే ప్రయోజనం:

"పరీక్ష పెట్టని రాష్ట్రాలు విద్యార్థులకు కేవలం పాస్ మార్కులు మాత్రమే ఇస్తున్నాయి. అదే పరీక్షలు జరిగితే విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయి. అలాంటప్పుడు మంచి కాలేజీల్లో వారికి సీట్లు ఎలా వస్తాయి.. పరీక్ష రాసిన వారికి 70 శాతం పైగా మార్కులు వస్తే, సీట్లు వారికే వస్తాయి కదా. కేవలం పాస్ మార్కులతో బయటపడిన విద్యార్థుల 50 ఏళ్ల భవిష్యత్తు ఏమిటి' అని సీఎం జగన్ ప్రశ్నించారు.

మంచి చేయాలనే:

"విద్యార్థులకు మంచి చేయాలన్న తపనతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. నిజానికి పరీక్షల రద్దు చేయడం చాలా సులభం. పరీక్షల నిర్వహణ ఇంకా బాధ్యతతో కూడుకున్నది. కోవిడ్ జాగ్రత్తలు తీసుకుని పరీక్షలు నిర్వహించాలి. కేవలం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నాము" అన్నారు.

టీచర్లు గుర్తించాలి:

"విద్యార్థుల మంచి భవిష్యత్తు కోసమే పరీక్షలపై నిర్ణయం తీసుకున్నామన్న విషయాన్ని ప్రతి టీచర్ గుర్తించాలి. ఇందులో అందరి సహాయ సహకారాలు కావాలని, తోడ్పాటు కావాలన్న విషయాన్ని వారందరికీ బలంగా చెప్పండి. అలాగే పరీక్షల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడా ఏ మాత్రం అలక్ష్యం చూపొద్దు. అన్ని కోవిడ్ జాగ్రత్తలతో ఈ పరీక్షలు నిర్వహించాలి' అని సీఎం జగన్ సూచించారు. విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వాడ్రేవు చినవీరభద్రుడు, సర్వశిక్షా అభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెట్రిసెల్వి, ఇతర ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు.

## కరోనా సమాచారం..

## రాష్ట్రాలకు సుప్రీంకోర్టు వార్నింగ్

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. సోషల్ మీడియాలో ఎవరైనా హాస్పిటల్ బెడ్ లేదా ఆక్సిజన్ కోసం అప్పీల్ చేసినప్పుడు వారిని వేధించినట్లు తెలిస్తే దానిని కోర్టు ధిక్కరణ కిందే పరిగణిస్తాం. ఈ సందేశం అన్ని రాష్ట్రాలు, డీజీపీలకు వెళ్లాల్సిందే. ఏ సమాచారాన్ని రాష్ట్రాలు కప్పిపుచ్చే ప్రయత్నం చేయొద్దు. ప్రస్తుతం మన జాతీయ సంక్షోభంలో ఉన్నాము అని జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

## పల్లగిరి గ్రామంలో అమానుషం : ఆలయ ధర్మ కర్త చాపల మడుగు మాధవరావు

నందిగామ ఏప్రిల్ 30 ప్రజా పాలన నందిగామ రూరల్ పల్లగిరి గ్రామంలో ఒక అమానవీయ సంఘటన ప్ర స్తుత పరిస్థితుల్లో జరిగింది ఆలయంలోకి దళితులకు ప్రవేశం లేదని ఆలయ ధర్మకర్త చాపల మడుగు మా ధవరావు హుకుం జారీచేశారు.ఎందుకు పాల్గొ న కూడదని ప్రశ్నించినందుకు కులం పేరుతో దూషణలు దౌర్జన్యాలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో మానవుడు ఎంతో ముందుకు పోతున్న ఇంకా సమాజంలో కుల వివ క్ష వేళ్లూనుకుని పోయింది అనడానికి ఇదే నిదర్శనం దేవాలయంలో అధికారులు లేకుండా వేలంపాట ని ర్వహిస్తున్న సమయంలో అక్కడకు వెళ్లిన దళిత ప్ర జా ప్రతినిధి ఎంపీటీసీ అభ్యర్థి వేల్పుల రాము పై ఆ లయ ధర్మకర్త అనుచిత వ్యాఖ్యలు చేయటమే కా కుండా దళితులకు వేలంపాట లో ప్రవేశం లేదని అన దంతో ఎందుకు లేదని ప్రశ్నించిన రాము పై కులం పే రుతో దూషిస్తే దౌర్జన్యం చేసిన సంఘటన కలకలం రే పుతుంది అధికారులు లేకుండా పాటలు జరగటం ఇ ష్టమని అడగటానికి నీవెవరు అని దూషించిన సం ఘటన ఆలస్యంగావెలుగులోనికి వచ్చింది. గతంలో కూడా స్థానిక శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగ న్మోహనరావు రామలింగేశ్వర స్వామి దే వాల యం లో ఆలయ గోపురం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే ఎమ్మెల్యే అయిననూ దళితుడు అయినందున శం కుస్థాపన పనికిరాదని మరల ఆలయాన్ని శుద్ధి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది ఈ వ్య వహారం చేసిన వ్యక్తి కూడా చాపల మడుగు మాధ వరావు కావడం విశేషం సమాజంలో ఏ స్థాయి వారి కైనా వివక్షత అవమానాలు ఎదురవుతున్నాయి అ నటానికి ఇదో పెద్ద నిదర్శనం బాధితులు అయి న టువంటి వేల్పుల రాము సంబంధిత పోలీస్ స్టేషన్లో తనకు న్యాయం చేయమని ఫిర్యాదు చేసినట్లు సమా చారం.

## ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చిన జగన్ ప్రభుత్వం: సయ్యద్ రఫీ

అమరావతి: ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా జగన్ ప్రభుత్వం మార్చిందని టీడీపీ అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ విమర్శించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు చూపితే ఆస్పత్రులు నో బెడ్, నో ఎంట్రీ అంటున్నారన్నారు. కరోనా రోగుల నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలను ఆస్పత్రులు బేఖాతర్ చేస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం తమవల్ల కాదంటూ ముఖ్యమంత్రి సొంత జిల్లాలో బోర్డులు పెడుతున్నారని మండిపడ్డారు. సకాలంలో బెడ్లు, ఆక్సిజన్ అందక రోగుల మృతి చెందుతున్నా...వైసీపీ ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెట్‌వర్క్ ఆస్పత్రులపై నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారన్నారు.

# మానవత్వం చాటిన దోర్నాల పోలీస్ నాగరాజు,సురేష్

### అభినందించిన ప్రకాశం జిల్లా ఎస్పీ కౌశల్



ప్రకాశం, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:దట్టమైన అడవి ప్రాంతం నుండి అనాధ శవాన్ని రెండు కిలోమీటర్ల దూరం భుజాలపై మోసుకొని గ్రామానికి తీసుకువచ్చి విధుల్లో మానవత్వం ప్రదర్శించిన ప్రకాశం జిల్లా పోలీసులు శుక్రవారం ప్రకాశం జిల్లా, దోర్నాల మండలం, మర్రిపాలెం గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో నీ దట్టమైన అడవి ప్రాంతంలో సుమారు 50-60 మధ్య వయస్సు గల ఒక యాచకుడు చనిపోయి ఉన్నట్లు గమనించిన మర్రిపాలెం గ్రామస్తులు సదరు సమాచారాన్ని వెంటనే దోర్నాల ఎస్సై కి తెలియజేశారు.ఎస్ఐ వెంటనే దోర్నాల పోలీస్ స్టేషన్ లో పనిచేసే జూనియర్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ అయిన %ఎజ%-1597 నాగరాజు , %ఎజ%- 1439 సురేష్ ను గ్రామానికి పంపిన్నారు.

వారు వెనువెంటనే మర్రిపాలెం గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవి ప్రాంతంకు చేరుకొని అక్కడ చనిపోయి ఉన్న యాచకుడును చూసి, మానవత్వంతో వ్యవహరించి సదరు శవాన్ని హెడ్ కానిస్టేబుల్స్ మరియు స్థానికుడు సహాయంతో ఒక కర్రకు కట్టుకొని స్వయంగా తమ భుజాల మీద 2%ఖఎ% మోసుకొని గ్రామానికి తీసుకొని వచ్చి, శవ గుర్తింపు నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీలో ఉంచారు. దోర్నాల పోలీస్ స్టేషన్లో పనిచేసే సదరు హెడ్ కానిస్టేబుల్స్ చేసిన మానవత్వంతో కూడిన విధులను ప్రకాశం జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ %శ్రూ% , పోలీస్ అధికారులు మరియు ప్రజలు అభినందించారు.



## వీళ్లు మారరు అంతే..

బెల్లంకొండ: ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ వారు చేస్తున్న సూచనలు అవగాహన సదస్సులు కౌన్సిలింగ్ హెచ్చరికలు ఇవి ఏవి వారికి చెవికెక్కడం లేదు తల్లిదండ్రులు మైనార్ బాలురూలకు వాహనాలు అప్పగించడం మానడం లేదు ఇలాంటి మైనర్ బాలురు ల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని కౌన్సెలింగ్ వల్లనైనా మార్పు వస్తుందోనని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు ప్రధాన సెంటర్లో అతివేగంగా వచ్చి బ్రేక్ ఏదో ఎక్స్ లెటర్ ఏదో తెలియని స్థితిలో ఆ బాలురు లో ఉన్నారని వేరే వాహనాలకు తగిలించడంమో లేక వాళ్లకు వాళ్లే కిందపడటం జరుగుతున్నవి ఇలాంటి వారిపై పోలీస్ శాఖ వారు తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా రాజధాని "అమరావతి"దే అంతిమ విజయం

### ఉక్కు పాదముతో అణిచివేసినా ఉద్యమించిన రైతన్నలకు అభివందనం

### బినరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు.



నరసరావుపేట. ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:లిరాజధాని అమరావతి పరిరక్షణే జీవిత ధ్యేయంగా ఉద్యమిస్తున్నా ఉద్యమాన్ని జగన్ సర్కార్ ఉక్కుపాదంతో అణిచి వేసినా ఉద్యమకారుల్ని మహిళలను సైతం పోలీసుల బూటు కాళ్లతో తన్నినా లాఠీలతో ఒళ్ళు చిట్లేల కొట్టినా అంకితభావంతో పోరు సల్పుతున్న రాజధాని రైతులకు విప్లవ అభివందనాలు ఇది వృధా కాదని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ లో జరిగిన వర్చువల్ మీటింగ్లో మాట్లాడుతూ 500 రోజులుగా అమరావతి ని రాజధానిగా కొనసాగించాలని మన భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న మీ త్యాగాలు నిరుపయోగం కాకూడదని అమరావతి రాజధాని శాశ్వత ప్రజారాజధానిగా ఉంటుందని ఆయన వివరించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే తలమానికంగా సంపద సృష్టించే అమరావతిని నారా చంద్రబాబునాయుడు సృష్టిస్తే మూడు రాజధానుల పేరుతో జగన్ సర్వనాశనం చేశారని అంతిమంగా జగన్ కు పరాభవం తప్పదని ఆయన హెచ్చరించారు.నాటి నుంచి నేటి వరకు అమరావతి పరిరక్షణకు అలుపెరుగని పోరాటం చేస్తున్న రైతన్నలకు మహిళలకు సకల జనులకు అంతిమ విజయమని ఆయన పేర్కొన్నారు.ఇది కేవలం రాజధాని ప్రాంత రైతన్నల ఉద్యమం కాదని ఇది ఐదు కోట్ల ప్రజల ఉద్యమని అన్నారు.వచ్చే ఎన్నికల్లో రాజధాని అమరావతి ప్రధాన అజెండాగా చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ పోటీ చేస్తుందని ఆయన తేల్చి చెప్పారు.రాజధాని రైతుల పై ముఖ్యంగా మహిళల పై వైసీపీ సర్కారు చేసిన దాష్టి కాలతో రాష్ట్రానికి అరిష్టం వచ్చిందని డా.చదలవాడ వ్యాఖ్యానించారు.

# మాచర్ల నియోజకవర్గ ప్రజలు కరోనా పట్ల అప్రమత్తంగా ఉండండి

### వైఎస్ఆర్సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి. వెంకటరామిరెడ్డి

పల్నాడు, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:మాచర్ల నియోజకవర్గ ప్రజలు కరోనా విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి.వెంకటరామిరెడ్డి కోరారు. శుక్రవారం అయన ఫోన్ ద్వారా వేజర్ న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ కరోనా సెకండ్ వేవ్ విజ్రూంభిస్తున్న తరుణంలో నియోజకవర్గ ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని అయన కోరారు. ప్రతిఒక్కరు మాస్క్ ధరించాలని అలాగే శానిటైజర్ ద్వారా చేతులను శుభ్రపారుచుకోవాలని అయన కోరారు. కరోనా విజ్రూంభిస్తున్న తరుణంలో నియోజకవర్గంలో లాక్ డౌన్ విధించటం జరిగిందని ఈ విషయాన్ని ప్రతిఒక్క వ్యాపారి గ్రహించాలని అయన అన్నారు. అవసరమైతేనే తప్ప అనవసరంగా ఎవరు కూడా ఇంటి నుంచి బయటకు రావద్దని ఒక వేల ఏదైనా పనిమీద బయటకు వస్తే పని ముగించుకొని వెంటనే వెళ్లిపోవాలని అయన సూచించారు. కరోనా కట్టడికి కృషి చేస్తున్న అధికారులకు సహకరించవలసిన బాధ్యత మనందరిపై ఉందని అయన అన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు పిఆర్కే అభిమానులు ఒక నెల రోజులు దయచేసి మీ ఇల్లు దాటి బయటకు రావద్దు అని నెలకు సరిపడా సరుకులు తీసుకొని ఇళ్లల్లోనే ఉండాలని అయన సూచించారు.



ఎవరికైనా ఎమ్మెల్యే గారితో అత్యవసరమైన సందర్భంలో ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు అని కార్యకర్తలు ప్రజలు ఈ విషయాన్ని గ్రహించాలని అయన కోరారు. మనం కష్టపడేది మన కుటుంబం కోసం అని మన కుటుంబానికి మనవమే ఆధారమన్న విషయం మరచిపోవద్దు అని ప్రతిఒక్కరూ కరోనా నిబంధనలు పాటించి మాస్కు ధరించి కరోనా కట్టడికి కృషి చేయాలనీ ఆయన కోరారు.

## అపోహలు వీడండి వ్యాక్సిన్ తీసుకోండి

### బెల్లంకొండ సచివాలయంలో 100 మందికి వ్యాక్సినేషన్



బెల్లంకొండ: ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:కరోనా నివారణకు ప్రతి ఒక్కరూ అపోహాలు విడనాడి వ్యాక్సిన్ తీసుకోవాలని చంద్రాజుపాలెం పీహెచ్సీ ఇంచార్జ్ వైద్యాధికారిణి బాల అంకమ్మ భాయ్ తెలిపారు బెల్లంకొండ సచివాలయం నందు 45 సంవత్సరాలు పై బడిన వారికి వంద మందికి కరోనా వ్యాక్సిన్ ఇవ్వడం జరిగిందని తెలిపారు ఈ వ్యాక్సిన్ వల్ల ఎలాంటి హాని ఉండదని ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని ముఖానికి మార్ప్క ధరించాలని భౌతిక దూరం పాటించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మధులత పంచాయతి సెక్రటరీ దుర్గారావు ఆశా వర్కర్లు నాగమణి షేక్ ఫాతిమా పి సుశీల తదితరులు పాల్గొన్నారు

## ఎంపీ నాని నిధులు కేటాయించడం అభినందనీయం-ఎమ్మెల్యే గద్దె

విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి :తూర్పు నియోజకవర్గంలోని పలు రోడ్ల నిర్మాణాలకు ఎంపీ కేశినేని నాని రూ. 50 లక్షలు కేటాయించడం అభినందనీయమని శాసనసభ్యులు గద్దె రామమోహన్ తెలిపారు. శుక్రవారం 5 వ డివిజన్‌లోని జయ ప్రకాష్ నగర్ మూడవ రోడ్డుకు రూ.10 లక్షలతో నిర్మించేందుకు శాసనసభ్యులు గద్దె రామమోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పు నియోజకవర్గంలో ఎంపీ కేశినేని నాని సహకారంతో కొంతమేరకైనా అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించిన ఎంపీ కేశినేని నానికి గద్దె రామమోహన్ నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.



## అసలు రిజర్వేషన్లు ఉండాలా ...వద్దా.?




వినుకొండ. ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: ఇరవై ఏళ్ళుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయలేదు! మరోవైపు ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు సంస్థలు గా మారుస్తున్నారు. ఆ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఏ ఆధిపత్య కులాలచేతుల్లో ఉన్నాయో వాళ్ళు వారి వర్గానికి మాత్రమే అవకాశాలు ఇస్తున్నారు!పైగా ఇదే జనాభా లో కేవలం 16 శాతం లోపే ఉన్న ఆధిపత్య పీడక కులాలు.. విద్యాలయాలు ,ఆసుపత్రులు, ఫ్యాక్టరీలు, కర్మాగారాలు ఏవైతే నేమి సమస్తమూ వారి చేతుల్లో ఉంచుకుని..50శాతం రిజర్వేషన్లు అనుభవిస్తున్న తీరు వాస్తవం..ఈ పరిస్థితి ఇప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎవరు ఎక్కువ మంది ఉన్నారో పరిశీలన చేసి చూడండి!మరోవైపు జనాభా లో 84 శాతం ఉన్న యస్.సీ,యస్.టీ,బీ.సీ లు 50 శాతానికి పరిమితం చేయబడిన విధానం పరిశీలించి చూడండి! అసలు ఈ సొల్లు కబుర్లు ఎందుకు ఎవరి జనాభా ఎంతో వారికి అంత రిజర్వేషన్లు ప్రభుత్వ , ప్రైవేటు సంస్థలలో అమలులోకి తీసురావాలి.. ఆదిశగా కేంద్రం రాజ్యాంగ సవరణలు చేయాలి ! ఆధిపత్య పీడక కులాలు తో పాటు ప్రభుత్వం పీడితుల కూ ఆసుపత్రులు, విద్యాలయాలు , ఫ్యాక్టరీలు.. ఏర్పాటు చేయించాలి! భారతీయులంతా ఒకే తల్లి బిడ్డలైతే వారిలో ఆర్థిక సామాజిక అసమానతలు ఎందుకు? స్వాతంత్ర్యం అందరికీ వస్తే కొందరి చేతుల్లోనే ఇంత సంపద ఎందుకు ఉంటుంది!

# ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్క్ ధరించాలి


### రూరల్ ఎస్ ఐ లక్ష్మి నారాయణ రెడ్డి







నరసరావుపేట, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: మండల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో కరోనా సెకండ్ వేకేసులు విపరీతంగా పెరుగుతున్న కారణంగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కు లుధరించాలని నరసరావుపేట రూరల్ ఎస్ ఐ లక్ష్మీ నారాయణ రెడ్డి అన్నారు.శుక్రవారం రూరల్ పరిధిలోని ప్రజలకు మస్కు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ ప్రతిరోజు షాపులు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకూ షాపులు తీసుకోవాలని రాత్రి 9 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు ఇళ్లలో నుంచి బయటికి రాకూడదని ఎస్ఐ లక్ష్మీ నారాయణ రెడ్డి అన్నారు. వినుకొండ రోడ్డు లో కరోనా వైరస్ జిల్లా ఎస్పీ డి.ఎస్.పి సి ఐ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. గ్రామస్తులకు ప్రయాణికులకు ఎస్ ఐ లక్ష్మీ నారాయణ రెడ్డి అవగాహన కరోనా వైరస్ పై అవగాహన కల్పించారు. కరోనా వైరస్ నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని అన్నారు. అందులో భాగంగా ప్రజలు అందరూ తప్పనిసరిగా మాస్కు లుధరించాలని అన్నారు. మాస్కులు ధరించకుండా తిరిగేవారిపై గ్రామీణ ప్రాంతాల్లో 500 రూపాయలు పట్టణ ప్రాంతాల్లో 1000 రూపాయలు వసూళ్ళు చేయడం జరుగుతుందని అన్నారు. కరోనా వైరస్ నివారణకు పోలీస్ శాఖకు అది గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు. మాస్కులు లేని గ్రామస్తులు ప్రయాణికుల నుండి పోలీసులు అపరాధ రుసుం వసూలు చేశారు.


# ప్రజాపాలన

## సంపాదకీయం

**శనివారం 01, మే 2021**

# ప్రత్యేకత కోల్పోయిన బెంగాల్

పశ్చిమబెంగాల్ శాసనసభ ఎన్నికలలో సుదీర్ఘంగా సాగిన ఎనిమిది విడతల పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. ఈ ఎన్నికల గురించి ఒక విషయాన్ని నిశ్చితంగా చెప్పవచ్చు. బెంగాల్ రాజకీయాలు శాశ్వతంగా మారిపోయాయి, మరింత క్షీణదశకు చేరుకున్నాయి. నేనేమీ ఎన్నికల ఫలితాన్ని గురించి జోస్యం చెప్పడం లేదు. జాతీయ ప్రాధాన్యాన్ని సంతరించుకున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయనే విషయమై మే 2న ఓట్ల లెక్కింపు జరిగే దాకా వేచిఉండదలుచుకున్నాను. బెంగాల్ ఎన్నికల గురించి నేను చెప్పదలుచుకున్న విషయానికి, ఫలితాలు కచ్చితంగా ఎలా ఉంటాయని ఊహించాల్సిన అవసరం లేదు. నా లక్ష్యానికి కొన్ని మౌలిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటే సరిపోతుంది. 2021 మార్చి-ఏప్రిల్‌లో పశ్చిమబెంగాల్ శాసనసభకు జరిగిన ఎన్నికలు దాదాపు తృణమూల్ కాంగ్రెస్, భారతీయ జనతాపార్టీ మధ్య జరిగిన ప్రత్యక్ష పోటీ అని నేను భావిస్తున్నాను. కాంగ్రెస్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్‌తో పొత్తు పెట్టుకున్న వామపక్షాల కూటమి ఒక ప్రధానశక్తిగా పునరావిర్భవించగలదనే ఆశ అడుగంటిపోయింది. ఈ తృతీయ శక్తి ఇంచుమించు పదిశాతం ఓట్లతో మూడోస్థానానికి పరిమితమవ్వచ్చు. ఈ ఎన్నికల్లో ఓట్లపరంగా తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ అది సీట్ల సంఖ్యలో ప్రతిబింబించకపోవచ్చు. పోలయిన మొత్తం ఓట్లలో 80 శాతాన్ని తృణమూల్, బీజేపీలు పంచుకునే అవకాశముంది. అది 40:40గా ఉంటే విజేత ఎవరనే విషయాన్ని కచ్చితంగా చెప్పలేము. ఆ ఓట్ల పంపకం 42:32గా ఉండి అది మమతా బెనర్జీకి అనుకూలంగా ఉన్న పక్షంలో ఆమె నాయకత్వానికి, ప్రశాంత్ కిశోర్ ఎన్నికల సూక్ష్మనిర్వహణకు మీడియా ఘనంగా నీరాజనాలు అర్పిస్తుంది. అలా కాకుండా మమత ప్రత్యర్థికి సానుకూలంగా ఉంటే, బెంగాల్‌లో నరేంద్ర మోదీ, అమిత్ షాల కాషాయ ప్రభంజనం గురించి టీవీ స్టూడియోలు హోరెత్తిపోతాయి. మే 2న పరిస్థితులు ఎవరికి అనుకూలంగా ప్రభవించినప్పటికీ పశ్చిమబెంగాల్‌లో ఒక మౌలిక రాజకీయ పునరేకీకరణ సంభవించిందన్నది స్పష్టం. 2019 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ సాధించిన అసాధారణ రికార్డు, కేవలం ఒకసారి విజయం మాత్రం కానేకాదనేది స్పష్టం. దేశ విభజనకు ముందు, తరువాత కూడా బెంగాల్లో హిందూ రాజకీయసంస్థలకు చెప్పుకోదగిన ఉనికి ఉన్నది. అయినప్పటికీ ఆ రాష్ట్ర రాజకీయాలలో తొలుత జనసంఘ్, ఆ తరువాత బీజేపీ ప్రభావం నామమాత్రమే. 2011 అసెంబ్లీ ఎన్నికలలో సైతం బీజేపీకి వచ్చిన ఓట్లు కేవలం 4.1 శాతం మాత్రమే. 2016 శాసనసభ ఎన్నికలలో ఆ పరిస్థితి 10.2 శాతం ఓట్లతో మూడు సీట్లకు మెరుగుపడింది. అప్పటికీ బెంగాల్లో బీజేపీ ఒక ప్రభావశీల రాజకీయశక్తి కాలేక పోయింది. 2019లో ఇదంతా ఆకస్మికంగా మారిపోయింది. ఆ సంవత్సరం 17వ లోక్‌సభ ఎన్నికలలో నరేంద్ర మోదీ పలుకుబడితో బీజేపీ తృణమూల్ కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఆవిర్భవించింది. బెంగాల్‌లోని 42 లోక్‌సభ స్థానాల్లో 18ని 40.6 శాతం ఓట్లతో బీజేపీ సొంతం చేసుకున్నది. ఆ విజయాలను 2021 అసెంబ్లీ ఎన్నికలలో నిలబెట్టుకుని బీజేపీ అధికారానికి వస్తుందా లేక యథావిధిగా అప్రాధాన్య స్థానానికి తిరోగమిస్తుందా? అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇంకా వెలువడనప్పటికీ ఈ ప్రశ్నకు ఒక స్పష్టమైన సమాధానం ఉన్నది: పశ్చిమ బెంగాల్ రాజకీయాలలో హిందూత్వ ఒక శాశ్వత శక్తిగా అలరారనున్నది. ఇప్పటికి కొంతకాలంగా రాజకీయ పోటీ ప్రధానంగా తృణమూల్, బీజేపీ మధ్యనే ఉంటూ వస్తోంది. కొద్ది సంవత్సరాల క్రితం ఇది అనూహ్య విషయం. మరి ఇదెలా సంభవమయింది? బెంగాల్ సమాజ సామాజిక చట్రం పునర్వ్యవస్థీకరణతోనే బీజేపీ ప్రభవప్రాభవాలు సుసాధ్యమయ్యాయి. వెనుకబడ్డ ప్రాంతాల, సామాజికవర్గాల వారిని ఆకట్టుకోవడం ద్వారా బెంగాల్ రాజకీయాలలోకి బీజేపీ ప్రవేశించింది. ఉత్తరబెంగాల్ లోని వెనుకబడ్డ జిల్లాలు, పశ్చిమప్రాంతంలోని జంగల్‌మహల్‌లో బీజేపీ తొలి విజయాలు సమకూర్చుకున్నది. దళితులు, ఆదివాసీలు, బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన హిందువులు, పట్టణ ప్రాంతాలలోని హిందీ భాషీయులలో బీజేపీ ఒక సుస్థిర స్థానాన్ని సాధించుకున్నది. 2019 సార్వత్రిక ఎన్నికలలో విజయాల అనంతరం ఇతర ప్రాంతాలకు విస్తరిస్తూ ఇతర సామాజికవర్గాల వారిపై బీజేపీ తన దృష్టిని కేంద్రీకరించింది. ముఖ్యంగా దక్షిణబెంగాల్‌లోని గ్రామీణప్రాంతాల్లోకి విస్తరించింది. బెంగాలీ మధ్యతరగతివర్గం భద్రలోక్‌ను విశేషంగా ఆకట్టుకున్నది. బెంగాల్ రాజకీయాలలో ఇదొక పెనుమార్పు. చాలాకాలంగా ఒక అప్రధాన శక్తిగా ఉంటూ వచ్చిన బీజేపీ కులతత్వ రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా ఒక కొత్త అస్తిత్వ రాజకీయాలకు నాంది పలికింది. బెంగాల్ రాజకీయాల్లో ఇదొక సరికొత్త పరిణామం. ఈ రాజకీయాలకు హిందూ ఓటర్ల సమీకరణే ప్రధాన ఆధారం. బెంగాల్లో ఎక్కడైనా సరే 40శాతం ఓట్లు పోలయ్యాయి అంటే రాష్ట్రంలోని 70శాతం హిందూ ఓటర్లలో మూడింట రెండు వంతుల మందిని తన వెనుక సుసంఘటితం చేసుకోవడంలో సఫలమయిందని అర్థం చేసుకోవచ్చు. ఓటర్లపరమైన ఈ పునరేకీకరణకు దీర్ఘకాల పర్యవసానాలు ఉంటాయి. బెంగాల్ ఓటర్లలో 30 శాతం మంది ముస్లింలు. మరి హిందువులను నిరంతరం భయాందోళనల్లో కాకపోయినప్పటికీ వ్యాకులతలో ఉంచడం బీజేపీకి తప్పనిసరి. ఈ పరిణామాలకు తోడు ప్రస్తుత ఎన్నికలలో కండబలం, ధనశక్తి, ఎన్నికల యంత్రాంగం ఒక కొత్తపాత్రను నిర్వహించాయి. పశ్చిమబెంగాల్‌లో ఇంతవరకు జరిగిన సమస్త ఎన్నికలలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలే అతి తక్కువ స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా జరిగే ఎన్నికలవుతాయని విస్తృత స్థాయిలో పలువురు భయపడ్డారు. ఆ భయాలు నిరాధారమైనవి కావని రుజువయింది. బెంగాల్ రాజకీయాల్లో కండబలం కొత్త పరిణామమేమీకాదు. దాని మూలాలు 1960 దశకంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్య ఘర్షణల్లో ఉన్నాయి. దరిమిలా కమ్యూనిస్టు పార్టీల మధ్య కూడా ఆ ఘర్షణలు తీవ్రస్థాయిలో కొనసాగాయి. లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం తన ప్రత్యర్థులకు వ్యతిరేకంగా నిత్యం హింసాకాండను రెచ్చగొట్టడం అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. తృణమూల్ కాంగ్రెస్ ఆ వారసత్వాన్ని మరింత తీవ్రస్థాయిలో కొనసాగించింది. 2018 పంచాయత్ ఎన్నికలలో తృణమూల్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హింసాకాండకు పాల్పడ్డారు. ప్రస్తుత ఎన్నికలలో ఆ పార్టీ పట్ల ప్రజల వ్యతిరేకతకు ఆ హింసాకాండ ఒక ప్రధాన కారణమని చెప్పక తప్పదు. బీజేపీ సైతం ఇప్పుడు ఆ హింసాత్మక వారసత్వాన్ని కొనసాగిస్తోంది. వామపక్షాలకు చెందిన పలువురు కార్యకర్తలు తమ విధేయతలను బీజేపీకి మార్చుకోవడంతో హింసాత్మక రాజకీయాలు కొనసాగేందుకు ఆస్కారమేర్పడింది. అయినప్పటికీ టీఎంసీ కండబలాన్ని ఎదుర్కొనే శక్తి బీజేపీకి ఎంతైనా కొరవడింది. ఈ లోటును కేంద్ర భద్రతాదళాలు తీర్చడం గమనార్హం. సిఆర్‌పిఎఫ్ మొదలైనవి బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని మమతా బెనర్జీ చేసిన ఆరోపణలు నిరాధారమైనవి కావు. ధనబలం విషయానికి వస్తే బెంగాల్ చరిత్రలో ప్రస్తుత ఎన్నికలు అత్యంత వ్యయభరితమైన ఎన్నికలనే చెప్పితీరాలి. ఓటర్లకు పెద్దఎత్తున కానుకలు ముట్టచెప్పినట్టు వార్తలు వెలువడలేదు కానీ మున్నెన్నడూ లేని విధంగా ఈ ఎన్నికలలో అనేకవిధాలుగా ధనప్రవాహం అమితంగా సాగిందన్నది స్పష్టం. ఎన్నికలకు ముందు పార్టీలు ఫిరాయించిన నాయకులకు, స్థానిక మధ్య వర్తులకు డబ్బు భారీస్థాయిలో ముట్టింది. కొత్త టీవీ ఛానెల్స్ ప్రారంభించేందుకు, పెద్దఎత్తున ఎన్నికలకు సంబంధించిన వాణిజ్య ప్రకటనలు ఇచ్చేందుకు అన్ని పార్టీలు అధికమొత్తంలో డబ్బు ఖర్చు పెట్టాయి. ఒకసారి ప్రారంభమయిన తరువాత ఇది ఆగిపోయేది ఎంత మాత్రం కాదు. ఎన్నికల సంఘం సైతం ప్రస్తుత బెంగాల్ ఎన్నికల్లో అత్యంత పక్షపాత వైఖరితో వ్యవహరించిందని చెప్పక తప్పదు. భారీగా రిగ్గింగ్ అయితే జరగలేదు. మంచిదే. అయితే పోలింగ్ షెడ్యూల్‌ను నిర్ణయించిన తీరు కేంద్రంలోని అధికారవక్షానికి అనుకూలంగా జరిగిందనేది స్పష్టం. ఈ విషయంలో తనపై వచ్చిన విమర్శలను ఈసీ పట్టించుకోలేదు. ఈ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణను పార్టీస్థాయిలో 'వృత్తిపర' వ్యవహారంగా నిర్వహించడం బెంగాల్ చరిత్రలో ఒక కొత్త మలుపు. 2019 సార్వత్రిక ఎన్నికలలో అపజయాలకు దిగ్భ్రాంతి చెందిన మమతా బెనర్జీ రాజకీయవ్యూహ రూపకల్పన బాధ్యతను ఔట్ సోర్సింగ్‌కు ఇచ్చారు. ఈ బాధ్యతను చేపట్టిన ప్రశాంత్ కిశోర్ పార్టీకి ఒక సమాంతర వ్యవస్థను సృష్టించారు. ప్రశాంత్, ఆయన బృందంవారు కొత్త, ప్రజాకర్షక విధానాలను రూపొందించారు. తృణమూల్‌కు ఒక కొత్త ప్రతిష్ఠను సమకూర్చారు. అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, పోలింగ్ ప్రక్రియల సూక్ష్మనిర్వహణలో కీలకపాత్ర వహించారు. మరి ఇవన్నీ మమతా బెనర్జీ హ్యాట్రిక్ సాధించడానికి దోహదం చేస్తాయా? చేసినా చేయకపోయినా ఒకటి మాత్రం స్పష్టం. రాజకీయనాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగే పాతశైలి ఎన్నికల నిర్వహణకు మళ్ళీ తిరిగి వెళ్ళడమనేది జరగబోదు. భారత రాజకీయాలలోని పలు ధోరణులు, నమూనాలకు బెంగాల్ చాలాకాలం నుంచి ఒక మినహాయింపుగా ఉన్నది. ఆ రాష్ట్రంలో రాజకీయ పార్టీల మధ్య పోటీ అద్వితీయమైనది. రాజకీయ కార్యకర్తలు భావజాలపరమైన భాషలో మాట్లాడడం కద్దు. భావజాలాల ప్రాతిపదికనే ఎన్నికల ప్రచారాలు జరగడం పరిపాటి. ఎన్నికలలో పోటీ చేసేవారు కుల, మత భావోద్వేగాలను రెచ్చగొట్టేవారు కాదు. ధనశక్తికి ప్రాధాన్యముండేది కాదు. పాలనానాణ్యత నాసిరకంగా ఉండేదనడంలో సందేహం లేదు. అయితే అన్నిటా రాజకీయాలే సర్వోత్కృష్టంగా ఉండేవి. 2021 అసెంబ్లీ ఎన్నికలు బెంగాల్ ప్రత్యేకతకు చరమగీతం పాడాయి. బెంగాల్ లోనే కాకుండా యావద్దేశంలోనూ అమెరికన్ శైలి రాజకీయ నిర్వహణకు అవి నాంది పలకనున్నాయి.



## రాబోయే తరాల కోసం

ప్రాణం తీయాలని చూసిన
విశాఖ ఉక్కు నేడు ప్రాణం పోస్తోంది
ఖాతాదారులకు అభయమిచ్చే
బ్యాంకుల ప్రైవేటీకరణతో
జీవిత బీమా తో ధీమాను పెంచిన
ఎల్ ఐ సి ప్రైవేటీకరణతో
ప్రజల ప్రయాణాలకు అందుబాటులో ఉన్న
రైల్వేల ప్రైవేటీకరణతో
గాలిలో చీకూచింతా లేకుండా ఎగిరే
విమానాల ప్రైవేటీకరణతో
ఒకటేమిటి అన్ని ప్రభుత్వ రంగాలను
కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే
అభినవ నీరో చక్రవర్తులు ఉన్నంతవరకు
దేశం ఆర్థిక సంక్షోభ జ్వాలల్లో
తగలబడి పోతూనే ఉంటుంది
పర్యావరణాన్ని కూడా
తూకం వేసి అమ్మి వేస్తూ ఉంటే
కరోనా సెకండ్ వేవ్ లే కాదు
థర్డ్ వేవ్ లు వచ్చినా
ఈ నీరో చక్రవర్తులు
ఆత్మ నిర్భర్ పేరుతో
ఫిడేలు వాయిస్తూనే ఉంటారు
ప్రజలారా తస్మాత్ జాగ్రత్త !
సమాజానికి ప్రాణాలు పోసే శక్తులను
ప్రాణాలు పోయినా కాపాడుకుందాం
మనకి కాకపోయినా
రాబోయే తరాల కోసం !

# అల్లోపతి వైద్యమే సంజీవనా?

కంటికి కనిపించని కరోనా వైరస్ భారతదేశానికి అగ్నిపరీక్షలా మారింది. ప్రపంచానికి వ్యాక్సిన్లు సరఫరా చేసే దేశానికే రక్షణ లేకుండా చేసింది. బదులే లేని పెనుసవాళ్లను, వేల ప్రశ్నలను సంధించి పరిహసిస్తోంది. దేశంలో ప్రస్తుత స్థితిగతులు అత్యయిక పరిస్థితుల్ని తలపిస్తున్నాయని ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించడం పాలనలోని డొల్లతనాన్ని, ఆరోగ్య రంగం వైఫల్యాన్ని కళ్లకి కట్టినట్లైంది. 74 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో... కనీస సౌకర్యాలు కరువై మన ప్రభుత్వాసుపత్రులు ఆర్థిక చీకట్లలో ఎలా కొట్టుమిట్టాడుతున్నాయో వెల్లడించింది. నియంత్రణ లేని కార్పొరేట్ ఆసుపత్రుల కాసుల వ్యామోహాన్ని బయటపెట్టింది. ముఖ్యంగా అన్నింటికీ ప్రైవేటీకరణే మందు అంటూ కార్పొరేట్ జపం చేస్తున్న కేంద్రప్రభుత్వ పెద్దల చెంపలు చెళ్లుమనిపించింది. ప్రభుత్వరంగ సంస్థలు దేశ నిర్మాణంలో నిస్వార్థ సేవలు అందించే లాభాపేక్ష లేని మూలస్తంభాలని, సంక్షోభకాలంలో దేశానికి ఆక్సిజన్ అందిస్తున్న విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వ కర్మాగారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ సమాజానిదేననే నిష్ఠుర నిజాన్ని వెల్లడించింది. 'భారతీయుల సనాతన సంప్రదాయాలు, ఆహార అలవాట్లే మనకి శ్రీరామరక్ష. మన రోగ నిరోధక శక్తి ముందు కరోనా తోక ముడుస్తుంది. ఎండలు ముదిరితే కరోనా పెరగదు. మాస్కు పెట్టుకుని జాగ్రత్తలు పాటిస్తే కరోనా రాదు'- అనే మాటలు కరోనా వ్యాప్తి చెందుతున్న రోజుల్లో సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొట్టాయి. అయితే అవన్నీ ఒట్టి మాటలేనని కల్లోల కరోనా చాటింది. ఎన్ని రకాల కషాయాలు తాగినా, తలుపులన్నీ బంధించుకుని మూలన కూర్చున్నా కరోనా వదలడం లేదు. మే నెలలో యాక్టివ్ కేసుల సంఖ్య భారీగా పెరుగుతాయని పేర్కొంటున్న సర్వేలు కలవరపరుస్తున్నాయి. ప్రస్తుతం 26 లక్షలకు పైగా ఉన్న యాక్టివ్ కేసులు మే 11 నుంచి 15 మధ్య సుమారు 35 లక్షలకు పెరిగి వైరస్ వ్యాప్తి శిఖర స్థాయికి చేరుకోనుందని కాన్పూర్, హైదరాబాద్ ఐఐటీలకు చెందిన శాస్త్రవేత్తలు వెల్లడించారు. కరోనా కట్టడికి నేటి వరకు సరైన మందు రాలేదు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న టీకాలు నూరుశాతం రక్షణనిస్తాయన్న నమ్మకం లేదు. కానీ మందు, చికిత్స లేని కరోనాకి తొలినాళ్ల నుంచి అల్లోపతిలోని రకరకాల మందులను వినియోగిస్తున్నారు. అత్యవసర వినియోగానికి వీలుగా కొన్ని ఔషధ కంపెనీలకు డీజీసీఐ అనుమతులివ్వడం పట్ల ఆ మధ్య విమర్శలూ వచ్చాయి. కరోనా నివారణకు అల్లోపతి మినహా మరో వైద్యం పనికిరాదనే విధంగా భారతీయ వైద్యమండలి (ఐఎంఏ) చర్యలు ఉన్నాయి. భారతీయ సంప్రదాయ వైద్య విధానాలైన ఆయుర్వేద, హోమియో, యునాని, సిద్ధ వైద్య విభాగాల ద్వారా కరోనాకు ప్రాథమిక వైద్యం అందించాలని కేంద్ర ఆరోగ్యశాఖ ప్రయత్నించినా అనేక ఒత్తిళ్లతో అది సాధ్యం కాలేదు. ఆనక కరోనా చికిత్సకు అల్లోపతి వైద్యం తప్ప మరేది అందించరాదన్న జీవో సైతం విడుదలైంది. అంటే దేశంలో అల్లోపతి వైద్యం ఒక్కటే గొప్పదా? వేల సంవత్సరాల చరిత్ర ఉన్న ఆయుర్వేదం అధమమా? అన్న ప్రశ్నలు విజ్ఞుల మదిలో ఉదయించక మానవు. అలా అయితే ఆయుర్వేద వైద్య విశ్వవిద్యాలయాలు, వైద్యకోర్సులు ఎందుకు? లక్షల మంది ఆయుర్వేద వైద్యుల్ని ఎందుకు నియమిస్తున్నట్లు? ఆయుష్ శాఖల్ని ఎందుకు ప్రోత్సహిస్తున్నట్లు? కల్లోల కరోనాతో జీవన హక్కే ప్రశ్నార్థకమవుతూ ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిన తరుణంలో అల్లోపతి విధానాన్నే ప్రోత్సహించాలనడం ఎంతవరకు సమంజసం? ఆధునిక టీకాలు పూర్తి శాతం రక్షణనిస్తాయన్న భరోసా లేనప్పుడు ప్రత్యామ్నాయ వైద్య



విధానాల గురించి ఎందుకు ఆలోచించకూడదు? అన్ని రకాల ప్రయోగాలు, పరిశీలనలు, ఫలితాలతో నిర్ణీత కాలావధిలో రూపొందించాల్సిన టీకాలను ఆగమేఘాల మీద తయారు చేస్తూ వాటి సమర్థతను ప్రశ్నార్థకంగా మారుస్తున్న నేపథ్యంలో ఉనికిలోకి వచ్చిన సహజ, ఆయుర్వేద మందుల సామర్థ్యాన్ని పరీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సహజ ఆహార పద్ధతులతో కరోనా అంతు చూడవచ్చన్న లక్ష్యంతో బలవంతంగా కరోనా తెప్పించుకుని 4 రోజుల్లో తగ్గించుకున్న సినిమా దర్శకుడు టి. ప్రభాకర్ విధానాన్ని పరిశీలించాలి. అలాగే కరోనా రాకుండా, ఒకవేళ సోకినా సులభంగా తగ్గించుకునే ఆయుర్వేద మందు కనిపెట్టిన, కాకినాడకు చెందిన రామ్‌జీపై నమ్మకంతో ఎంతోమంది ఆయన మందును వాడి కరోనా నుంచి బయటపడ్డారు. ఆ ఔషధంపై పేటెంట్‌కు దరఖాస్తు చేయడం దానిపై ప్రత్యేక వ్యాసం ప్రచురితంకావడం జరిగాయి. ఈ నేపథ్యంలో రామ్‌జీ మందు ప్రభావాన్ని అంచనా వేసే బాధ్యతను ఆయుష్‌కి అప్పగించాలి. కరోనా రోగులకు మానసిక స్థైర్యం, సరైన చికిత్సా విధానాన్ని తెలియ చెప్పాలన్న సంకల్పంతో సహజ ఆహార పోషక నిపుణులు బిశ్వరూప్ రాయ్ చౌదరి వంటి ప్రముఖ నిపుణుల నేతృత్వంలో అన్ని విభాగాలకు చెందిన కొందరు డాక్టర్లు ఒక బృందంగా ఏర్పడి %చీ×జజు% అనే పేరుతో ఉచిత టెలిఫోన్ వైద్య సేవలందిస్తున్నారు. అలాగే 4 రోజుల ప్రత్యేక ఆహార ప్రణాళికను సూచిస్తున్నారు. ఈ పద్ధతి ఫలితానిస్తుంటే ప్రజలకి చెప్పడంలో తప్పేముంది? అలాగే బిహార్‌కు చెందిన ఆయుర్వేద వైద్యులు పంకజ్ కుమార్ సైతం ఇలాంటి సహకారాన్నే రోగులకు అందిస్తున్నారు. సమర్థంగా పని చేసే ప్రత్యామ్నాయ వైద్య విధానాలను ప్రోత్సహించాలి. కరోనా బీభత్సంతో జనం పిట్టల్లా రాలుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణాలు కాపాడడానికి మించినది మరొకటి లేదు. అల్లోపతి ఒక్కటే ప్రామాణికం అన్న చట్ట నిబంధనలను దేశ హితం కోసం సవరించాలి. శాస్త్రీయత, ప్రమాణాలంటూ కొర్రీలు వేయకుండా మంచి అన్నది ఏ మందులో ఉంటే ఆ వైద్య విధానాన్ని కేంద్రప్రభుత్వం ప్రజలకు చేరువ చేయాలి. కరోనా ఆయుర్వేద మందుల తయారీ దరఖాస్తులకు కేంద్రం మోక్షం కల్పించాలి. క్షేత్రస్థాయిలో ప్రభావం చూపుతున్న ఆయుర్వేద ఔషధాల పనితీరు పరిశీలించి అనుమతించాలి. ప్రజలు కూడా ప్రభుత్వాలకు సహకరించాలి. ప్రజలు, -ప్రభుత్వాలు ఏకమై కరోనాపై సమర్థవంతంగా పోరాడితే మహమ్మారిని జయించవచ్చు. మరింత ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. ఆ దిశగా అడుగులు పడాలని, కరోనా అంతం కావాలని ఆశిద్దాం.

# మే, జూన్ నెలల్లో 10 కిలోల చొప్పున పంపిణీ

**రాష్ట్రంలో మళ్ళీ ఉచిత బియ్యంతో పేద ప్రజలకు సీఎం జగన్మోహనరెడ్డి అభయం**

**రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని**



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 30: రాష్ట్రంలో మళ్ళీ ఉచిత బియ్యంతో పేద ప్రజలకు సీఎం జగన్మోహనరెడ్డి అభయమిచ్చారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. శుక్రవారం కృష్ణాజిల్లా గుడివాడలో మంత్రి కొడాలి నాని విలేఖర్లతో మాట్లాడారు. బియ్యం కార్డులున్న కుటుంబాల్లో ఒక్కో సభ్యుడికి 10 కిలోల చొప్పున సార్టెక్స్ స్వర్ణ రకం మధ్యస్థ సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మే, జూన్ నెలల్లో ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేసి పేదల ఆకలి తీర్చేందుకు దాదాపు రూ. 800 కోట్లు వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. రాష్ట్రంలో మొత్తం 1.47 కోట్ల బియ్యం కార్డులు ఉన్నాయన్నారు. వీటిలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టం కింద 88 లక్షల బియ్యం కార్డులను మాత్రమే గుర్తించిందన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి కేంద్ర ప్రభుత్వం 5 కేజీల బియ్యాన్ని మాత్రమే ఇస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం గుర్తించని మరో 59 లక్షల బియ్యం కార్డుల కుటుంబాలకు కూడా ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేయాలని సీఎం జగన్మోహనరెడ్డి నిర్ణయించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 5 కిలోలకు అదనంగా మరో 5 కిలోలు కలిపి మొత్తం 10 కిలోల బియ్యాన్ని కార్డుదారుల్లో ఒక్కో సభ్యుడికి ఉచితంగా అందించనున్నామన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో గత ఏడాది మార్చి 29 వ తేదీన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్ డౌన్ ఆంక్షలను విధించాయన్నారు. ఈ ఆంక్షల కారణంగా పేదలు ఉపాధికి దూరమయ్యారన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడూ ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశ్యంతో సీఎం జగన్మోహనరెడ్డి ఉచిత నిత్యావసరాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. గత ఏడాది మార్చి నుండి నవంబర్ నెల వరకు 16 విడతలుగా పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నిత్యావసరాలను పంపిణీ చేశామన్నారు. కరోనా సెకండ్ వేవ్ ఉధృతంగా ఉందని, ఈ పరిస్థితుల్లో కూడా బియ్యం కార్డుదారులను ఆదుకునేందుకు సీఎం జగన్మోహనరెడ్డి రెండు నెలల పాటు బియ్యం కార్డుదారులకు ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా పేదలకు ఉపాధి తగ్గుతోందని, మరికొందరు పని ఉన్నా బయటకు రాలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. పేదలను మరింతగా ఆదుకునేందుకు సీఎం జగన్మోహనరెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. వచ్చే మే, జూన్ నెలల్లో జరిగే ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బియ్యం కార్డుదారులందరూ వినియోగించుకోవాలని మంత్రి కొడాలి నాని సూచించారు.



## దుర్గి మండల బీఎస్పీ అధ్యక్షుడు నాగండ్ల కోటయ్య

మాచర్ల, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జి జెట్టిపాలెం వెంకటేష్, జాంబవంత రాజు దుర్గి మండల అధ్యక్షులు గా నాగండ్ల కాటయ్య పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జి జెట్టిపాలెం వెంకటేష్ జాంబవ రాజు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో బహుజన సమాజ్ పార్టీ దుర్గి మండలం సీనియర్ నాయకుడిగా నాగండ్ల కాటయ్య నియమించటం పలువురు సీనియర్ నాయకులు బహుజన కళాకారులు బీఎస్పీ కార్యకర్తలు నాయకులు పదవీ బాధ్యతలు తీసుకున్న వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బి ఎస్ పి నాయకుడు గురజాడ అప్పారావు ,సారీ రామ వతి ,మాంగో బాయ్ వేదవతి, దేవి భాయ్, ఖమ్మం పాటి దానం, కోళ్ల పేతురు, బూడిద లక్ష్మయ్య ,నాగండ్ల కాటన్ అభినందించారు. దుర్గ మండల అధ్యక్షులుగా పదవి బాధ్యతలు తీసుకున్నందుకు నాకు ఎంతో సంతోషంగా ఉందని నాగండ్ల కాటయ్య పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తానని మాటిచ్చారు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలతో మాన్యశ్రీ కాన్షీరామ్ అడుగుజాడల్లో నడిచి రాజ్యాధికారం కోసం కుమారి మాయావతి నాయకత్వాన్ని జెట్టిపాలెం వెంకటేష్, జమున రాజు సారథ్యంలో బీఎస్పీ పార్టీ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాచర్ల పట్టణ అధ్యక్షులు పేరు పోగు బాబురావు నాగండ్ల కాటన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు...

# మీ శరీరంలో రోగనిరోధక శక్తి ఉందా..? కోవిడ్-19పై పోరాటంలో విజయం మీదే..:ఏపీ కోవిడ్-19 కమాండ్ కంట్రోల్

దేశవ్యాప్తంగా కోవిడ్-19 వైరస్ రోజురోజుకు విజృంభిస్తోంది. ఈ నేపథ్యంలో కోవిడ్-19 బారిన పడకుండా ఉండేందుకు మనం చేయాల్సింది రోగనిరోధక శక్తిని పెంచుకోవడమే. మాస్క్ ధరించడం, తరచూ చేతులను శుభ్రం చేసుకోవడం, భౌతిక దూరం పాటించడం ఎంత ముఖ్యమో.. మన శరీరంలో రోగ నిరోధకశక్తిని పెంచుకోవడం కూడా అంతేముఖ్యం. మన శరీరంలో రోగనిరోధక శక్తి ఉంటే ఒక వేళ కోవిడ్ సోకినా రోగనిరోధక శక్తి కారణంగా త్వరగా కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడకుండా ఉంటాయి. మనలో రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) మెరుగ్గా ఉంటే పలు వైరస్‌లు, వ్యాధులను కూడా సమర్థంగా ఎదుర్కొనే వీలుంటుందని పోషకాహార నిపుణులు అంటున్నారు. రోగ నిరోధక శక్తిని పెంచడంలో ఎ, ఇ, డి, సి, బి విటమిన్లు, జింక్, సెలీనియం, ఐరన్, కాపర్ తదితర ఖనిజాలు, ఫైటోన్యూట్రియెంట్స్, అమైనో ఆమ్లాలు, ఫ్యాటీ ఆమ్లాలు కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే కరోనా మహమ్మారిని ఎదుర్కోవడానికి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ కూడా ఇదివరకే అనేక సూచనలు చేసింది. ప్రతి ఒక్కరూ ఆయుష్ మంత్రిత్వశాఖ ఇచ్చిన సూచనలను పాటిస్తూ రోగనిరోధక శక్తిని పెంచుకునేందుకు ప్రయత్నించాలి.

రోగనిరోధక శక్తిని పెంచుకునే సాధారణ పద్ధతులు:

దాహం అనిపించినప్పుడల్లా గోరు వెచ్చని నీరు తాగండి

ప్రతి రోజూ కనీసం 30 నిమిషాలు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయండి

రోజువారీ వంటకాలలో పసుపు, జీలకర్ర, దనియాలు, వెల్లుల్లి తప్పకుండా ఉండేలా చూసుకోండి

ప్రతి రోజు కనీసం 20 నిమిషాల పాటు ఎండలో ఉండండి

ఆయుర్వేద పద్ధతుల ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుకునే మార్గాలు:

ప్రతి రోజూ ఉదయం ఒక టీస్పూను చవనప్రాశ్ తినాలి. మధుమేహ వ్యాధి ఉన్నవారు చక్కెర లేని చవనప్రాశ్ తీసుకోవాలి

తులసి, దాల్చిన చెక్క, నల్ల మిరియాలు, శొంఠి, ఎండు ద్రాక్ష మొదలైనవాటితో చేసిన ఆయుర్వేద తేనీరు రోజుకు ఒకటి లేదా రెండుసార్లు తాగండి. అలాగే మీ అభిరుచిని బట్టి బెల్లం లేదా తాజా నిమ్మరసాన్ని కలుపుకోవచ్చు.

150 మిల్లీ లీటర్ల పాలలో అరస్పూను పసుపు కలుపుకొని రోజుకు ఒకటి లేక రెండుసార్లు తాగండి

సులభమైన ఆయుర్వేద పద్ధతులు:

నువ్వుల నూనె లేదా కొబ్బరి నూనె లేదా నెయ్యిని ముక్కు రంధ్రాల దగ్గర పట్టించండి. ఇలా ఉదయం మరియు సాయంత్రం చేయండి

ఒక టేబుల్ స్పూన్ నువ్వుల నూనె లేదా కొబ్బరి నూనెను తీసుకుని నోటిలో వేసుకుని రెండు మూడు నిమిషాలపాటు పుక్కిలించి తర్వాత ఊసేయాలి. ఆ తరువాత వెంటనే నోటిని గోరు వెచ్చని నీటితో శుభ్రం చేయాలి. ఇలా రోజుకు ఒకటి రెండుసార్లు చేయవచ్చు

పొడిదగ్గు ఉంటే పుదీనా ఆకులను లేదా సోపు గింజలు కలిపిన నీటి ఆవిరిని రోజుకు ఒకసారి పీల్చుకోవాలి

లవంగాల పొడిని బెల్లంతో లేదా తేనెతో కలుపుకుని రోజుకు రెండుసార్లు తీసుకుంటే దగ్గు లేదా గొంతు గరగర నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఒకవేళ పొడి దగ్గు ఎక్కువగా ఉంటే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి

క్యారెట్లు, ఆకుకూరలు:

క్యారెట్లు, ఆకుకూరల్లో విటమిన్-ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రక్తంలో ఉండే విష పదార్థాలు, సూక్ష్మక్రిములు తొలగిపోతాయి. క్యారెట్లతోపాటు ఆకుకూరలు, చిలగడదుంప, కీరాదోస, మామిడి పండ్లు, కర్బూజా పండ్లలో, యాప్రికాట్లలో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్-ఎ గా మారి మన శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.

ఉసిరితో ఎన్నో ప్రయోజనాలు:

ఆమ్లా లేదా ఇండియన్ గూస్బెర్రీగా పిలుచుకునే ఉసిరి మన శరీరానికి ఎన్నో ప్రయోజనాలు కలిగిస్తుంది. శతాబ్దాలుగా వివిధ ఆరోగ్య పద్ధతుల్లో వ్యాధుల చికిత్స కోసం దీన్ని ఉపయోగిస్తున్నారు. ఉసిరిలో నారింజలో కన్నా వీటిలో 20 రెట్లు ఎక్కువ విటమిన్ సీ ఉంటుంది. విటమిన్ సీ శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. నాడీ వ్యవస్థ, రోగనిరోధక వ్యవస్థ, చర్మానికి మేలు చేస్తుంది. ఇది కాకుండా, జీవక్రియ, ఎముకల నిర్మాణం, పునరుత్పత్తి, రోగనిరోధక ప్రతిస్పందనను పెంచడానికి ఉసిరి సహాయపడుతుంది. ఆమ్లా జ్యూస్ లేదా రోజూ ఉదయం ఒక పండు తినడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందిచుకోవచ్చు.

నారింజతో ఆరోగ్యం:

నారింజ కూడా ఎన్నో విధాలుగా మన ఆరోగ్యానికి ఉపయోగపడే సిట్రస్ జాతి పండు. వీటిని వివిధ రకాలుగా ఆహారాల్లో చేర్చుకోవచ్చు. మీడియం సైజ్ ఆరెంజ్ లో 53.2 మి.గ్రా విటమిన్ సీ ఉంటుంది. వీటిలోని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు మన రోగనిరోధక ఆరోగ్యాన్ని పెంచడానికి, ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి మన కణాలను రక్షించడానికి సహాయపడతాయి. జలుబు, ఇతర అలెర్జీలతో బాధపడుతున్న వారికి నారింజ ఎంతో మంచిది. ఈ పండు కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి.. ఒత్తిడి హార్మోన్ స్థాయిలను తగ్గిస్తుంది.

ద్రాక్ష:

మన శరీరంలో రోగ నిరోధక కణాలను, తెల్ల రక్త కణాలను వృద్ధి చేసేందుకు విటమిన్-సి ఎంతగానో ఉపయోగపడుతుంది. ద్రాక్ష, బత్తాయి పండ్లు, కివీలు, స్ట్రాబెర్రీలు, బెంగళూరు క్యాబేజీ, క్యాప్సికం, మిరియాలు, ఉడకబెట్టిన క్యాబేజీ, కాలిఫ్లవర్‌లలో మనకు విటమిన్-సి అధికంగా లభిస్తుంది. దీంతో శరీర రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

కోడిగుడ్లు, పాలు:

బాక్టీరియా, వైరస్‌లు రక్తంలో ఇన్ఫెక్షన్లను కలిగిస్తాయన్న సంగతి తెలిసిందే. అయితే విటమిన్-డి తగినంతగా ఉంటే ఆ ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. అందుకు విటమిన్ డి ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఇది మనకు సూర్యరశ్మి ద్వారా లభిస్తుంది. అలాగే చేపలు, గుడ్లు, పాలు, చీజ్, వెన్న, పనీర్, పుట్టగొడుగులలోనూ విటమిన్-డి లభిస్తుంది. వీటిని తరచూ తీసుకోవడం ద్వారా శరీరంలో ఇన్‌ఫెక్షన్లు ఏర్పడకుండా చూసుకోవచ్చు. అలాగే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టమవుతుంది.

పౌల్ట్రీ ఉత్పత్తులు, సోయా:

పౌల్ట్రీ ఉత్పత్తులు, సోయాబీన్, మాంసం, శనగలు, చిక్కుడు జాతి గింజలు, చిరు ధాన్యాలు, గింజలు, చీజ్, పనీర్, పెరుగులలో జింక్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల మనకు జింక్ లభిస్తుంది. దీంతో శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

పైన సూచించిబడిన వాటిని తీసుకుంటూ మనలో రోగనిరోధక శక్తిని పెంచుకుందాం. కరోనా మహమ్మారిని ధైర్యంగా ఎదుర్కొందాం.

**డాక్టర్ అర్జా శ్రీకాంత్**
**స్టేట్ నోడల్ ఆఫీసర్,**
**కోవిడ్-19**

## ఈ ట్రాఫిక్ ని నియంత్రించండి





బెల్లంకొండ, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: స్థానిక మండల కేంద్రంలో తరుచు ట్రాఫిక్ వలయంలో చిక్కుకొని ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు వివరాల్లోకి వెళితే బెల్లంకొండ ప్రధాన సెంటర్లో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది అదే సమయంలో కొన్ని దుకాణాలకు సరుకు రావటంతో షాపుల ఎదురు వాహనాలు నిలుపుకొని సరుకు దింపుకోవడం తో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని స్థానిక ప్రజలు చెబుతున్నారు పోలీస్ శాఖ వారు బెల్లంకొండ సెంటర్ లో సెంటర్ పార్కింగ్ ఇవ్వటంతో ద్విచక్ర వాహనదారులు పార్కింగ్ చేయడంతో అటు నుండి ఇటు వెళ్లలేక వాహనాలు ఐదు నుండి పది నిమిషాల వరకు ట్రాఫిక్ లో ఉండవలసి వస్తుంది అని వివిధ గ్రామాల ప్రజలు చెబుతున్నారు ఇకనైనా స్థానిక ఎస్ఐ గారు తమ మీద దయ ఉంచి సెంటర్లో ఒక హోంగార్డు ని నియమించాలని స్థానిక ప్రజలు మండల ప్రజలు కోరుతున్నారు.

## రాజధాని రైతుల దీక్షలు దేశ చరిత్రలో చిరస్మరణీయం... 500 రోజులకు చేరిన రైతుల నిరసన దీక్ష-మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:అమరావతి రాజధాని భూములు ఇచ్చిన రైతులు న్యాయంగా వారికి దక్కాల్సిన హక్కు కోసం ప్రభుత్వంపై గత 500 రోజులుగానిరసనదీక్షలు ,ప్రదర్శనలు, ధర్నాలు, లాఠీఛార్జిలను ఎదుర్కొని పోరాటం చేస్తున్న తీరు దేశ చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉంటుందని రాష్ట్ర మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఏ ఉద్యమాలు వెనుక ఉండి ఎవరని అడిగితే ఇన్ని రోజులు నడవడాని ముఖ్యమంత్రి గ్రహించాలని హితవు పలికారు. 38,500 ఎకరాలను రైతులు రాష్ట్రం కోసం ఇచ్చి ,అభివృద్ధి చెందిన రాజధానిలో తమ భవిష్యత్తును గొప్పగా చూసుకోవాలని ఆశించారు. అయితే ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం భూములు ఇచ్చిన రైతులను రోడ్డు పాలు చేసిందని, అన్నదాత కన్నీరు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కి మంచిది కాదు అని తెలిపారు. దీక్ష తో 500 రోజులుగా 33 గ్రామాలకు చెందిన 35,500 మంది రైతులు పోరాటం చారిత్రాత్మకం అని తెలిపారు. రైతుల దీక్షలు వృధాగా పోవు అని రాష్ట్రానికి అమరావతి మాత్రమే ఏకైక రాజధాని అని అంగీకరించే రోజులు తప్పకుండా వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# కరోనాతో ఇబ్బందిపడే పాత్రికేయులకు వైద్య సేవల అనుసంధానానికి నోడల్ ఆఫీసర్లు

**సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి**

విజయవాడ,ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:ప్రస్తుతం కరోనా సెకండ్ వేవ్ విస్తృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో కరోనా మహమ్మారి బారినపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాత్రికేయులకు వైద్య సేవలు అందించటంలో జిల్లా వైద్య యంత్రాంగానికి, పాత్రికేయులకు మధ్య అనుసంధాన కర్తలుగా పనిచేసేందుకు సమాచార శాఖ రాష్ట్ర స్థాయిలో ఒక సీనియర్ అధికారిని, జిల్లా స్థాయిలో శాఖాధిపతులను నోడల్ అధికారులుగా నియమించినట్లు సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, కోవిడ్-19 రాష్ట్ర స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు శ్రీ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నోడల్ అధికారులు సంబంధిత జిల్లాలలో గుర్తించిన ఆసుపత్రిలో పాత్రికేయులకు వైద్య పరీక్షల నిర్వహణ నుంచి వైద్యం అందించటం, కోవిడ్ ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకునే వరకు సహాయకారిగా ఉంటూ అన్ని అవసరమైన వైద్య చర్యలను తీసుకోవలసిందిగా వారిని ఆదేశించారు. పాత్రికేయులకు వైద్యం అందించేందుకు రాష్ట్ర స్థాయిలో నోడల్ అధికారిగా సమాచార, పౌరసంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు పోతుల కిరణ్ కుమార్ (మొబైల్ నెం: 9121215223) ను నియమించామని, అదేవిధంగా ప్రతి జిల్లాలో సమాచార శాఖ (ఉపసంచాలకులు/సహాయ సంచాలకులు), సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లను పాత్రికేయులకు అందుబాటులో ఉంచి ఎల్ల వేళలా వారికి సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాత్రికేయులు విధినిర్వహణలో భాగంగా అనేక ప్రాంతాలకు వెళ్లవలసి రావటం అలాంటి సందర్భంలో మాస్క్, శానిటైజర్ లు వాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాత్రికేయుల విధినిర్వహణను దృష్టిలో ఉంచుకొని వారికి వ్యాధి నిరోధక టీకా (వ్యాక్సిన్) ను వేయించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి తగు చర్యలను తీసుకోవాల్సిందిగా నోడల్ అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కోవిడ్-19 బారినపడిన పాత్రికేయులకు ప్రత్యేకంగా ఆసుపత్రులలో బెడ్లు కేటాయించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ లో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యధికంగా కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక పక్క వైద్యులు కరోనా నియంత్రణకు ముందు వరుసలో నిలబడి వైద్యం అందిస్తున్నారని వారికి మీడియా కూడా సహకారం అందించాలన్నారు. కోవిడ్ బారిన పడి చనిపోయిన పాత్రికేయులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 5 లక్షలు సాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందుకు సంబంధించిన దరఖాస్తు ఫారం మరియు అన్ని వివరాలతో కూడిన డాక్యుమెంట్లను జిల్లాలోని సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులకు అందజేయాల్సిందిగా కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి తెలియజేశారు.

# మహిళల ఆరోగ్య అవసరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి: ఉపరాష్ట్రపతి

- ఆరోగ్యవంతమైన సమాజంలో మహిళల పాత్ర కీలకం, అందుకే వారి అవసరాలను గౌరవించాలి
- ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు ప్రసూతి మరణాల రేటును తగ్గించడాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలి
- తెలంగాణ ప్రభుత్వాసుపత్రుల్లో సిజేరియన్ కేసులు తగ్గడం అభినందనీయమన్న ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యానాయుడు
- ఈ దిశగా ప్రైవేటు ఆసుపత్రులు తమవంతు పాత్ర పోషించాలని పిలుపు
- 29వ యుధ్‌వీర్ స్మారక అవార్డును అంతర్జాల వేదిక ద్వారా డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్‌కు ప్రదానం చేసిన ఉపరాష్ట్రపతి



న్యూఢిల్లీ,ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: దేశ జనాభాలో 50 శాతం ఉన్న మహిళల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేకమైన దృష్టిసారించాల్సిన అవసరం ఉందని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఉపరాష్ట్రపతి నివాసంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ సమావేశ ప్రాంగణం నుంచి అంతర్జాల వేదిక ద్వారా, హైదరాబాద్‌కు చెందిన స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్‌కు యుధ్‌వీర్ స్మారక అవార్డును ఉపరాష్ట్రపతి ప్రదానం చేశారు. మహిళల ఆరోగ్య సంరక్షణ రంగంలో చేసిన విశిష్ట సేవకు గానూ డాక్టర్ ఫెర్నాండేజ్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యాన్ని విస్మరించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఆరోగ్యకర సమాజంలో కీలకంగా ఉన్న మహిళల ఆరోగ్య అవసరాలను తీర్చేవిధంగా వివిధ వైద్య సంరక్షణ కార్యక్రమాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు.ప్రసూతి మరణాల రేటును తగ్గించే విషయంలో భారతదేశం గణనీయమైన ప్రగతిని సాధించిన విషయాన్ని గుర్తు చేసిన ఉపరాష్ట్రపతి, ఈ రేటును మరింత తగ్గించడం ద్వారా ఐక్యరాజ్యసమితి నిర్దేశించినట్లుగా 2030 నాటికి ప్రతి లక్ష ప్రసూతి కేసుల్లో మాతృ మరణాలను 70 కంటే తక్కువకు తీసుకురావడం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునే దిశగా కృషిజరగాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలోని మహిళల్లో ఉన్న పౌష్టికాహారలోపం సమస్యను పరిష్కరించడంపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. మహిళల ఆరోగ్య సంరక్షణ, పునరుత్పత్తి తదితర అంశాల్లో డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్, (యుధ్‌వీర్ అవార్డు గ్రహీత) చేసిన సేవలను ఉపరాష్ట్రపతి అభినందించారు. మహిళల సాధికారత, సాధారణ ప్రసూతి తదితర అంశాల్లో డాక్టర్ ఫెర్నాండేజ్ తీవ్రంగా కృషిచేశారన్నారు. 'సిజేరియన్ కేసులను తగ్గిస్తూ సాధారణ ప్రసూతి కేసులను ప్రోత్సహించడం ద్వారా మహిళల్లో ధైర్యాన్ని నింపేందుకు డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్ చేసిన కృషి ప్రశంసనీయం. వారి కృషిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను' అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసూతి కేసులను పెంచే లక్ష్యంతో యూనిసెఫ్‌తో కలిసి తెలంగాణ ప్రభుత్వం, ఫెర్నాండేజ్ ఆసుపత్రి చేసిన కృషిని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ ప్రయత్నాన్ని మనఃపూర్వకంగా అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిజేరియన్లను తగ్గించే ఈ మహత్కార్యంలో ప్రైవేటు ఆసుపత్రులు కూడా కలిసి రావాలని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణ కూడా అత్యంత కీలకమన్న ఉపరాష్ట్రపతి, ఈ దిశగా ప్రసూతికి సహకరించే వైద్యసిబ్బంది కోసం ఓ నేషనల్ కేడర్ ఏర్పాటు విషయంలో డాక్టర్ ఫెర్నాండేజ్ తీసుకున్న చొరవను ప్రశంసించారు. తెలంగాణలోని ప్రభుత్వాసుపత్రుల్లో దాదాపు 1500 మంది నర్సులకు ప్రసూతి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో శిక్షణ ఇచ్చేందుకు ఫెర్నాండేజ్ ఫౌండేషన్ ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివంగత శ్రీ యుధ్‌వీర్ గారి స్మృతికి ఉపరాష్ట్రపతి నివాళులు అర్పించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన శ్రీ యుధ్‌వీర్ గారు, స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజికవేత్తగా, పాత్రికేయుడిగా తన పాత్రను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. సత్యం, నిజాయితీలకు పెద్దపీట వేస్తూ నైతికత కలిగిన పాత్రికేయుడిగా నిలిచారన్నారు. వారు మొదట ఉర్దూ మిలాప్ పత్రికను స్థాపించారని, తదనంతరం 1950లో ఈ సంస్థ ఆధ్వర్యంలో హిందీ మిలాప్ పత్రికను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన విషయాన్ని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. నైతికతకు విలువలకు పట్టం గట్టిన జర్నలిజాన్ని హిందీ మిలాప్ కొనసాగిస్తోందని ప్రశంసించారు. దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో హిందీ మాట్లాడే ప్రజలతో ఈ పత్రిక మమేకమైందన్నారు. ఈ కార్యక్రమంలో యుధ్‌వీర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ మురళీధర్ గుప్తా, అవార్డు గ్రహీత డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులు ఇతర ప్రముఖులు అంతర్జాల వేదిక ద్వారా పాల్గొన్నారు.

## భక్తితో శ్రీబగళాముఖి అమ్మవారికి సువర్ణహారం



బాపట్ల, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:గుంటూరు జిల్లా చందోలు గ్రామంలోని శ్రీబగళాముఖి అమ్మవారి వార్షిక తిరునాళ్ళ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి రఘుపతి మరియు దేవాదాయ శాఖ మాత్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు కలసి భక్తిశ్రద్ధలతో శ్రీబగళాముఖి అమ్మవారికి సువర్ణహారం సమర్పించడం జరిగింది.

## ఆపద కాలంలో మనవంతు సాయం చేద్దాం

**-నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు**

**-కోవిడ్ నివారణ చర్యలకు విరాళం అందించిన హెచ్ ఫౌండేషన్, ఐకాన్ లాబ్ వారు**



గుంటూరు,ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సహృదయంతో చేతనైన సాయాలు చేయాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో కోవిడ్ నివారణ చర్యల నిమిత్తం హెచ్ ఫౌండేషన్, మెడ్ ఐకాన్ లాబ్ వారు రూ. 50వేలు విరాళంగా నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలుకి అందించారు. ఈ సందర్భంగా వీరిని ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కరోనా కష్ట కాలంలో నిరుపేదలకు అండగా నిలవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సేవ కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సురాబత్తుని సురేష్, గుంటుపల్లి హరగోపాల్, గోపి పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ముదిగుబ్బ తహసీల్దార్

అనంతపురం: జిల్లాలోని ముదిగుబ్బ తహసీల్దార్ అన్వర్ హుస్సేన్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన గోపాల్ నాయక్ అనే రైతు నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. పట్టాదారు పాస్‌బుక్ ఆన్‌లైన్ చేసేందుకు రూ.5 లక్షలు డిమాండ్ చేసిన తహసీల్దార్....రూ.2 లక్షలు గ్రామ రెవెన్యూ అధికారికి ఇవ్వాలని సూచించారు. ఈ క్రమంలో రైతు నుంచి లంచం తీసుకుంటున్న వీఆర్వోను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం తలుపులు వేసి తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బందిని ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

## వైద్య అధికారులు ప్రజలకు కరోనా టి కా పై అవగాహన కల్పించాలి

**ఎంఐఎం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మౌలాలి**




నకరికల్లు, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: నియోజకవర్గంలోని ప్రజలకు కరుణ టీకాల పై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జి షేక్ మౌలాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం మండల కేంద్రమైన నకరికల్లు లో మీడియా సమావేశం నిర్వహించిన ఎంఐఎం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జి "షేక్ మౌలాలి ఈ సందర్భంగా ఆయన "మాట్లాడుతూ దేశంలో కరోనా విలయ తాండవం చేస్తున్న సమయంలో నకరికల్లు వీధుల్లో బ్లీచింగ్ , హైపో క్లోరినేషన్ వంటి ప్రక్రియలు చేయటంలో అధికారులు విఫలమయ్యారని కరోనా టీకా సంబంధించి అవగాహన ఏర్పరచాలని, చిన్న చిన్న జ్వరాలు సంబంధించి వ్యాధులు వచ్చిన ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారని టీకాలు వేయించుకోవాల వద్ద అని సందేహం లో ప్రజలు ఉన్నారని శుభ్రత పరిశుభ్రత వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు పంచాయతీ శాఖ వారు కనీసం ప్రతి బజారు ప్రతి గ్రామం ప్రతి వార్డు లో బ్లీచింగ్ చల్లడం ద్రావణం పిచికారీ చేయడం వంటివి చేసి కరోనా వైరస్ వ్యాప్తి చేయకుండా అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు అదేవిధంగా ఉపవాస దీక్ష విరమించే ఈ సమయంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని అంతరాయం కలగకుండా చేయాలని ఆయన కోరేరు.

## వైయస్సార్ పింఛన్ కానుగాకు 93 లక్షల 87 వేలు రిలీజ్

**యం డి ఓ.డీజే నాయక్**

బెల్లంకొండ: (ప్రజా పాలన) బెల్లంకొండ మండలానికి వైయస్సార్ పింఛన్ కానుక మండలంలో 3864 మంది లబ్ధిదారులు ఉండగా వారికి కేటాయించిన నగదు 93 లక్షల 87 వేల రూపాయలు ఆయా సచివాలయాలకు రిలీజ్ చేయడం జరిగిందని బెల్లంకొండ ఎండిఓ డీజే నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు గ్రామాల వారిగా విడుదల చేసిన రూపాయలుు-

1.బెల్లంకొండ సచివాలయం 552 మందికి 1349250/-
2. చంద్రాజుపాలెం సచివాలయం 524 మందికి 1246250/-
3. న్యూ చిట్యాల సచివాలయం 289 మందికి 687750/-
4. కంది పాడు 289 మందికి 685250/-
5. మా చాయ పాలెం 287 మందికి 729750/-
6. మన్నె సుల్తాన్ పాలెం 377 మందికి 949250/-
7. నాగిరెడ్డి పాలెం 666 మందికి 1613250/-
8. పాపాయపాలెం 431 మందికి 1613250/-
9. వన్నాయపాలెం 216 మందికి 515000-
10. వెంకటాయపాలెం 233 మందికి 557750/-

ఈ విధంగా ఆయా సచివాలయాల కార్యదర్శులకు పంపిణీ చేయడం జరిగిందని అదే విధముగా ఒకటవ తారీఖు నాడు ప్రతి సచివాలయంలో వాలంటరీల చేత 100% పింఛన్ల పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు

## ఆర్‌టిపిసిఆర్, యాంటిజన్ టెస్టు.. ఐడి నంబరు ఉంటేనే కొవిడ్ కేర్ సెంటర్‌లో చేర్చుకుంటాం



చిలకలూరిపేట, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:చిలకలూరిపేట పట్టణంలోని కొవిడ్ కేర్ సెంటర్‌లో ఆర్‌టిపిసిఆర్, యాంటిజన్ టెస్టులు చేయించుకుని పాజిటివ్ వచ్చి ఐడి నంబరు ఉన్నవారిని మాత్రమే చేర్చుకోవడం జరుగుతుందని కొవిడ్ నోడల్ వైద్యాధికారి గోపినాయక్ తెలిపారు. చిలకలూరిపేట టిడ్కో గృహసముదాయంలో ఏర్పాటు చేసిన కొవిడ్ కేర్ సెంటర్ వద్ద నుంచి గోపినాయక్ మాట్లాడుతూ టెస్టు రిజల్ట్‌తోపాటు ఐడి నంబరు ఉంటేనే జాయిన్ చేసుకోవడం జరుగుతుందని లేనిపక్షంలో ఎట్టిపరిస్థితిలోనూ జాయిన్ చేసుకునేందుకు వీలు పడదన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొవిడ్ కేర్ సెంటర్‌లో 150మంది వరకు బాధితులు సేవలు పొందుతున్నారన్నారు. అదేవిధంగా సిటి స్కాన్ రిపోర్టు ప్రకారం క్రిటికల్‌గా ఉంటే అలాంటి వారిని ఇక్కడ సెంటర్లలో చేర్చుకోవడం కుదరదని అలాంటివారిని గుంటూరు సిఫారుసు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రైవేటు ఆసుపత్రుల వారు రెమ్‌డెసివర్ ఇంజక్షన్‌లు, ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధంగా ఉంచుకోవాలని, బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## కోవిడ్ వైద్యాధికారులతో కరోనా నివారణకు సంబంధించి విధివిధానాలపై చర్చ



బాపట్ల, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:ఈ రోజు బాపట్లలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి కోన రఘుపతి నివాసంలో కోవిడ్ విభాగం వైద్యాధికారులతో మరియు సచివాలయాల మెడికల్ ఏ యన్ యం ల తో కలిసి సమీక్ష నిర్వహించి కోవిడ్-19 కు సంబంధించి" ఐ సి యం ఆర్ " టెస్టుల గురించి మరియు కరోనా నివారణకు సంబంధించి నియమనిబంధనల గురించి విధివిధానాలపై చర్చ జరిపిన బాపట్ల శాసనసభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోన రఘుపతి మరియు మునిసిపల్ కమీషనర్ భానుప్రతాప్ తదితరులు ఈ కార్యక్రమంలో బాపట్ల ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రసూల్ మరియు కోవిడ్ విభాగ ప్రధాన వైద్యాధికారులు డా,, భాస్కరరావు,చరణ్ రాయ్ మరియు తదితర వైద్య అధికార సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ విమాన సర్వీసులపై సస్పెన్షన్‌ను పొడిగించిన ఇండియా

న్యూఢిల్లీ,ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: అంతర్జాతీయ విమాన సర్వీసులపై విధించిన సస్పెన్షన్‌ను మే 31వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్టు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) శుక్రవారం నాడు ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే 'కేస్ టు కేస్' ప్రాతిపదకపై ఎంపిక చేసిన రూట్లలో ఇంటర్నేషనల్ షెడ్యూల్డ్ ఫ్లయిట్లను అనుమతించే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, డీజీసీఏ ఆమోదం పొందిన కార్గో ఆపరేషన్లు, విమానాలకు సస్పెన్షన్ ఆంక్షలు వర్తించవని ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. దేశంలో కరోనా సంక్షోభం తలెత్తడం, ఆక్సిజన్, వ్యాక్సిన్ కొరత వంటి సమస్యల నేపథ్యంలో డీజీసీఏ తాజా ఆదేశాలిచ్చింది. కరోనా కేసుల పెరుగుదల కారణంగా 2020 మార్చి 23న అంతర్జాతీయ విమాన సర్వీసులను సస్పెండ్ చేశారు. అయితే, 'వందే భారత్ మిషన్' కింద కేంద్ర ప్రభుత్వం గత మే నుంచి ద్వైపాక్షిక 'ఎయిర్ బబుల్' అరేంజ్‌మెంట్స్ కింద ఎంపిక చేసిన దేశాలకు ప్రత్యేక అంతర్జాతీయ విమానాలను నడుపుతోంది. ఇంతవరకూ అమెరికా, యూకే, యూఏఈ, కెన్యా, భూటాన్, ఫ్రాన్స్ సహా 27 దేశాలతో ద్వైపాక్షిక ఎయిర్ బబుల్ ఒప్పందాలను ఇండియా చేసుకుంది. అయితే, కరోనా వైరస్ సెకెండ్ వేవ్ నేపథ్యంలో, పలు దేశాలు కోవిడ్ పరిస్థితి మెరుగయ్యేంతవరకూ ఎయిర్ బబుల్ ఒప్పందం కింద ఇండియా నుంచి వచ్చే విమానాలపై నిషేధం విధించాయి. కాగా, తమ అనుమతి పొందిన అంతర్జాతీయ కార్గో ఆపరేషన్లు, విమానాలపై ఈ ప్రభావం ఉండదని డీజీసీఏ తాజా సర్క్యులర్‌లో పేర్కొంది. ఇండియాలో కోవిడ్ కేసులు విజృంభిస్తున్న దృష్ట్యా వచ్చే మూడు వారాలు అన్ని డైరెక్ట్ ప్యాసింజర్ ఫ్లయిట్స్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్ తాజాగా ప్రకటించారు.



# ఎఫ్.ఎన్.ఓ. కొల్లిమర్ల.నాగేంద్రమ్మ సేవలు ఆదర్శనీయం

- వైద్యాధికారి డాక్టర్ ఎస్ విజయభాస్కర్
- నాగేంద్రమ్మ అందించిన వైద్య సేవలు స్ఫూర్తి దాయకం
- 43సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ వైద్యశాలల్లో విధుల నిర్వహణ
- పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానం, ఆత్మీయ సత్కార కార్యక్రమం









చీరాల(ఒంగోలు), ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:మహిళా ఆరోగ్య పరిరక్షకురాలిగా వివిధ వైద్య శాలలలో అంకితభావంతో ఎఫ్.ఎన్.ఓ. కొల్లిమర్ల నాగేంద్రమ్మ అందించిన వైద్య సేవలు స్ఫూర్తిదాయకం మరియు ఆదర్శనీయమని చినగంజాం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్. ఎస్. విజయభాస్కర్ అన్నారు. చినగంజాం పి హెచ్ సి ఆవరణలో శుక్రవారం ఎఫ్ ఎన్ ఓ కొల్లిమర్ల నాగేంద్రమ్మ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన ఆత్మీయ సత్కార కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మర్యాద పూర్వకంగా నాగేంద్రమ్మను సన్మానించి, అనంతరం డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ ఏ ఉద్యోగి కైనా పదవీ విరమణ తప్పదని, అయితే వారు విధినిర్వహణలో చేసిన సేవలను మనమందరం ఆదర్శం గా తీసుకోవాలన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, 43సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ వైద్యశాలల్లో విధులు నిర్వహించి, ఎందరో గర్భవతులకు, బాలింత లకు కన్న తల్లిలా వైద్య సేవలు అందించి అధికారుల మన్ననలు పొందటం ప్రశంసనీయమన్నారు. వైద్యఆరోగ్యశాఖ లో ఉన్నతాధికారుల ప్రశంసలు, ఎన్నోఅవార్డులు అందుకున్న నాగేంద్రమ్మ రిటైర్డ్ అయిన తర్వాత, ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరుకుంటున్నామన్నారు. వైద్యశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, బంధువులు, సన్నిహితులు, పలువురు నాగేంద్రమ్మను ఘనంగా సన్మానించారు. పదవీవిరమణ వీడ్కోలుసభలో నాగేంద్రమ్మ మాట్లాడుతూ, చినగంజాం పి.హెచ్.సి.కి, దేవుడే డాక్టర్ రూపంలో వచ్చాడనిపించేలా, డాక్టర్ విజయభాస్కర్ అంకితభావంతో, అహర్నిశలు ఏ మాత్రం విశ్రాంతి తీసుకోకుండా, వైద్య సేవలు అందించటం ప్రశంసనీయమన్నారు. అటువంటి వైద్యులు, అత్యంత ఆత్మీయంగా నిజాయితీగా అంకితభావంతో సేవలు అందించే వైద్యశాల సిబ్బంది సమిష్టి సహాయ సహకారాలతోనే, ప్రశాంతంగా పదవీ విరమణ చేయగలిగానని, డాక్టర్ విజయభాస్కర్ కు, వైద్యశాల సిబ్బంది అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సి.హెచ్.ఓ దీనాకుమారి, పి.హెచ్.ఎన్.బేబి, హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ శ్యామ్,సీనియర్ అసిస్టెంట్ బాలాకుమారి,ఫార్మాసిస్ట్ సుశీల,పర్యవేక్షకులు సుబ్బారావు, లీలావతి, ప్రసన్న, స్టాఫ్‌నర్సులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీలో ఉంటూ విభేదాలు సృష్టించే గిట్టని వ్యక్తులు చేసే దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దు

- మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు
- విభేదాలుసృష్టించి,పార్టీకి చెడ్డపేరు తెచ్చే నాయకులపై చర్యలు తీసుకోవాలి
- పార్టీ మారాల్సిన అవసరం లేదు, దురుద్దేశంతో,టీడీపీలోకి వెళ్తున్నానని దుష్ప్రచారం
- ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి నాయకత్వంలో పనిచేస్తామని స్పష్టీకరణ




చీరాల(ఒంగోలు),ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: పార్టీలో ఉంటూ విభేదాలు సృష్టించే గిట్టని వ్యక్తులు చేసే దుష్ప్రచారాన్ని, ప్రజలు నమ్మవద్దని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు విజ్ఞప్తి చేశారు. చీరాలలోని తన వైద్యశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి నాయకత్వంలో పార్టీలో నాయకులంతా కలసికట్టుగా పని చేస్తున్నామని చెప్పారు. ఓడించారన్న కక్షతో నియోజకవర్గంలో ప్రజలను ఇబ్బంది పెట్టే క్రమంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మాజీ ఎమ్మెల్యేపై పార్టీ అధిష్టానం క్రమశిక్షణచర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో ప్రజలను ఇబ్బందిపెడుతున్నారన్న ఒకే ఒక్క లక్ష్యంతో, 2014లో పోతులసునీతకు పనిచేసి, స్వల్ప ఓట్లతో ఓడిపోవడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం వ్యక్తి పట్ల ద్వేషంతో, ఎమ్మెల్యే బలరామకృష్ణ మూర్తికి మద్దతుగా పనిచేసి గెలిపించుకోవడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేకు సన్నిహితంగా ఉంటున్న తమను దూరంచేయాలన్న దురుద్దేశంతో, టీడీపీలోకి వెళుతున్నానని దుష్ప్రచారం చేయిస్తున్నారన్నారు. ఎంతో ఓర్పు,సహనం కలిగిన ఎమ్మెల్యేబలరామకృష్ణమూర్తి లాంటి నాయకుడిని కాదని, తనకు పార్టీ మారాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పార్టీలోనే ఉంటూ మున్సిపల్ఎన్నికల్లో సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీ ఫారాలు ఇచ్చిన అభ్యర్థులకు, వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థులను నిలబెట్టి కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన నీచసంస్కృతి మాజీ ఎమ్మెల్యేది అన్నారు. జెడ్పీటీసీ ఎన్నికలలో ఆయన నిలబెట్టిన పార్టీ అభ్యర్థులను బలపరిచి పార్టీకి అనుగుణంగా పనిచేశామని గుర్తుచేశారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలలో మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సిఫారసు మేరకు, వార్డు సభ్యులుగా పోటీచేసిన వారిపై స్వతంత్ర అభ్యర్థులను నిలబెట్టి పార్టీ అభ్యర్థుల ఓటమికి పాటుపడినసంస్కృతి నాది కాదన్నారు. నియోజకవర్గంలో విద్యా,వ్యాపార సంస్థలు, వైద్యశాలలు, బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఎవరికి వారు ప్రశాంతంగా ఉన్నారంటే, అది ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి చలువేనన్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే ఎమ్మెల్యే తనయుడు కరణం వెంకటేష్‌కు, చీరాలసీటు కేటాయించాలని,కోరిన సంగతిని పాలేటి గుర్తుచేశారు. నియోజక వర్గం లో పార్టీఅభివృద్ధికి డాక్టర్ అమృతపాణి, మున్సిపల్‌చైర్మన్ జంజనం.శ్రీనివాసరావు, అవ్వారు మునలయ్య, తదితర నాయకులంతా ఐక్యంగా కృషిచేస్తున్నామని తెలిపారు. పార్టీలో విభేదాలుసృష్టించి,పార్టీకి చెడ్డపేరు తెచ్చే నాయకులపై చర్యలు తీసుకోవాలని,పాలేటి రామారావు పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

- పార్టీ మారే ప్రసక్తే లేదని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు స్పష్టీకరణ

పార్టీ మారే ప్రసక్తే లేదని,స్థానిక శాసనసభ్యుడు కరణంబలరామ్‌తోనే తనపయనం కొనసాగుతుందని ఆయన మాజీమంత్రి, చీరాలనియోజకవర్గ వైసిపినేత.డాక్టర్ పాలేటిరామారావు స్పష్టం చేశారు.స్పష్టంచేశారు.బలరాంరాకతో, చీరాలలో అరాచకపాలనకు తెర పడిందని, ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని,ఎప్పుడూ కోరుకునేతాను అందుకుకారకుడైన బలరాంతోనే పయనిస్తాను తప్ప, ఇంకోపార్టీలోకి వెళ్లే ప్రసక్తిలేదని, వైసిపిని వీడబోనని తేల్చిచెప్పారు.బలరాం వెంట ఉన్న వైసిపి నేతలందరూ కలిసికట్టుగా ఉండటంతో, వారిలో చీలికతేవాలన్న ఉద్దేశంతో ఇలాంటి కుట్రకథనాలు వచ్చాయన్నారు. అయితే 2024ఎన్నికల్లో బలరాం కుమారుడు వెంకటేష్‌కి, చీరాల వైసిపి టిక్కెట్టు ఇప్పించి,ఆయన గెలుపునకు కృషి చేస్తామని డాక్టర్ పాలేటి ప్రకటించడం కొసమెరుపు.

## దేవస్తానము యొక్క వార్షిక బ్రహ్మోత్సవాలు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:తిరుమలగిరి గ్రామములో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్తానము యొక్క వార్షిక బ్రహ్మోత్సవాలలో 5వ రోజైన నేడు శ్రీ స్వామి వారికి విశేషపూజలు, హెూ మములు, అనంతరం ఉదయం 11 గంటలకు వసం తోత్సవము, చక్రతీర్ధము పూర్ణాహుతి కార్యక్రమ ము లు నిర్వహించుట జరిగినది. ఈ రోజున రాత్రి 8 గం టలకు ధ్వజ అవరోహణం జరుగునని ఆలయ సహా య కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎన్ ఎస్ చక్రధరరావు వారు తెలియజేసారు.



## కనుచూపు కైనా కనిపించని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు

పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి: అనిగండ్లపాడు గ్రామంలో రైతుల పాలిట శాపంగా మారిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం, గత 20 రోజులుగా ధాన్యం కోతలు కోస్తున్నారు, కానీ ఇప్పుడు వరకు గ్రా మంలోని సొసైటీ ద్వారా ఎటువంటి దాన్యం కొనుగో లు, జరగకపోవడం పై గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, దీనిని ఆసరాగా తీసుకున్న దళారులు ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర ఏ గ్రేడ్ రకం 75కేజీలు 1416, సాధారణ రకం 1401 రూపాయలు ఉండగా నిన్న మొన్నటి వరకు 75కేజీలు 1300/-లకు,ఈరోజు నుంచి కేవలం 1050/- రూపాయలు అడుగుతున్నా రని, అసలే పెట్టుబడులు పెరిగి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న కానీ కనీసం ప్రభుత్వం వారు ఎవరైనా ప ట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు, దీనిపై మన ప్రతినిధి గ్రామంలోని




రైతు భరో సా కేంద్రం వారిని సంప్రదించగా, రైతులు వస్తే మేము రిజిస్ట్రేషన్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, సొసైటీ వారు కొనుగోలు చేయాలని వారు కొనుగోలు చేయ టం లేదని అన్నారు, సొసైటీ వారిని సంప్రదించడానికి వెళ్లగా ఎవరూ అందుబాటులో లేకపోవడంతో, ఫోన్ లో కాంటాక్ట్ చేయగా ప్రస్తుతానికి మొక్కజొన్న లో కొనుగోలు చేస్తున్నామని, రైతులు ఎవరైనా 16% మ్యాచర్ వస్తే మేము కొనుగోలు చేస్తామని అంటు న్నారు కానీ ఇంతవరకు ఒక బస్తా కూడా కొనుగోలు చేయకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు.

## విఘ్నేశ్వర స్వామి వారికి గరిక పూజ



జగ్గయ్యపేట, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:జగ్గయ్యపేటలో బంగారపు కోట్ల సెంటర్లో వేంచేసియున్న శ్రీ స్వ యం భు విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో చైత్రమాస సంకష్టహార చతుర్థిని పురస్కరించుకొని శుక్రవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, గరిక పూజ, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అర్చకులు తే లిదేవరపల్లి భరద్వాజ్ ఆధ్వర్యంలో ఏకాంతసేవ గా నిర్వహించారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న కరోనా నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని ఈ కార్యక్రమం నిర్వ హించినట్లు అర్చకులు తెలియజేశారు.

## ట్యాంకర్ల ద్వారా సోడియం హైపోక్లోరైడ్ స్ప్రే



నందిగామ, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:నందిగామ నగర పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధు ల్లో ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సోడియం హైపోక్లోరైడ్ స్ప్రే చేసే వాహనాలను శాసనసభ్యుడు డాక్టర్ మొం డితోక జగన్ మోహన్ రావు ప్రారంభించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా కట్ట డికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని చర్యలు తీసుకుంటున్నారని ,అందులో భాగంగానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రతి నియోజకవ ర్గం లో కూడా కోవిడ్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు ,ప్రజలందరూ వ్యాక్సిన్ వేయించుకునేలా ప్ర త్యేక చర్యలు తీసుకున్నారన్నారు అదేవిధంగా నంది గామ పట్టణంలో కూడా కరోనా కట్టడికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని ,పట్టణంలోని 20 వార్డు లో సోడియం హైపోక్లోరైడ్ రసాయనాన్ని చల్లించడం తో పాటు ,శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించమన్నా రు ,ప్రజలు కూడా కరోనా పై అప్రమత్తంగా ఉండాలని ,తప్పనిసరిగా మాస్కులు ధరిస్తూ ,భౌతికదూరం పా టించాలన్నారు ,అవసరమైతే తప్ప బయటకు రావ ద్దని ,దగ్గు-జ్వరం లాంటివి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ,కరోనా కట్టడికి ప్రభుత్వం తీసుకుం టున్న చర్యలకు సహకరించాలన్నారు .ఈ కార్యక్ర మంలో నగర పంచాయతీ చైర్మన్ ,మున్సిపల్ కమి షనర్ ,మరియు ఇతర అధికారులు ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## సీఐ కనకారావు చొరవతో ఆంజనేయ స్వామి దేవ స్థానంలో దొంగలు దొరికారు



నందిగావం, ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:ఇటీవల పట్టణ శివా రు ప్రాంతం చందావురం గ్రామంలో ఆంజనే య స్వా మి దేవస్థానంలో ఇటీవల హుండీ పగులగొట్టి సొమ్మును దొంగలు కొల్లగొట్టారు.ఆలయంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలను పట్టుకోవడం పోలీసులుకు పెనుసవాల్ గా మారింది.వారం తిరగకముందే స్థా ని క సీఐ కనకారావు సారధ్యంలో ఇద్దరు ఎస్సైలు తాతాచార్యులు,హరిప్రసాద్ లు దొంగలను పట్టుకో వ డంలో సఫలీకృతులయ్యారు.సాధారణ తనిఖీల్లో భాగంగా అనాసాగరంవద్ద ఇద్దరు వ్యక్తులు సుమారు 16 నుంచి 18 సంవత్సరాల వయసు గల ఇద్దరు బాలురు బైక్ మీద రావడానికి గమనించి వారిని ఆ ప్రయత్నంలో వారంతటవారే బైక్ దిగి పరారైనారు పోలీసులు వెంటనే వారిని వెంబడించి పట్టుకున్నారు అనంతరం వారి దగ్గర నుంచి విలువైన సమాచారా న్ని రాబట్టారు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆంజనే య స్వామి దేవస్థానంలో విజయవాడ పెనమలూరు లో ఒక దొంగతనం చేశానని నాగేంద్ర స్వామి ఆల యంలో ఇంకా పలు రకాల దొంగతనాలు ఉన్నట్టుగా సమాచారం రాబట్టారు.అనంతరం వీరిని రిమాండ్ కు తరలించారు.

## త్వరలో చంద్రబాబుకు చిప్పకూడు ఖాయం:వెల్లంపల్లి



పొన్నూరు ,ఏప్రిల్ 30, ప్రజాపాలన ప్రతినిధి:త్వరలో చంద్రబాబుకు చిప్పకూడు ఖాయం అని దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు. చంద్రబాబు నాయుడికి, అచ్చెం నాయుడికి, దేవినేని ఉమకి త్వరలో దూళిపాళ్లకు పట్టిన గతే పడుతుందన్నారు. పొన్నూరు పట్టణంలోని శ్రీ ఆంజనేయ స్వామిని శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..త్వరలో చంద్రబాబుకు చిప్పకూడు ఖాయం అని దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు. చంద్రబాబు నాయుడికి, అచ్చెం నాయుడికి, దేవినేని ఉమకి త్వరలో దూళిపాళ్లకు పట్టిన గతే పడుతుందన్నారు. చంద్రబాబుకు ముని శాపం ఉంది నిజం చెబితే తల వెయ్యి వక్కలు అవుతుందన్నారు. గత ప్రభుత్వంలో నాయకులు అందరూ దొంగలేనని అయినా దొరల్లాగా తిరిగారన్నారు. హెరిటేజ్ కోసం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఉన్న పాల డెయిరీలన్నిటిని నిర్వీర్యం చేసాడన్నారు. సంగం డెయిరీ ఎవడబ్బ సొత్తు అని ధూళిపాళ్ళ తన జేబు సంస్థగా మార్చుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో టిడిపి నాయకులు అచ్చోసిన ఆంబోతులలాగా ప్రజల రక్తం తాగిన దుర్మార్గులన్నారు. తెలుగుదేశం నాయకులు దోచుకున్న సొమ్ము ప్రజలకు అప్పగించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఎవరెవరికి డేట్స్ ఇస్తావ్ తారక్..!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ వరుసగా ఐదు విజయాలు అందుకుని మంచి ఫార్మ్ లో ఉన్నాడు. ప్రస్తుతం దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో 'ఆర్.ఆర్.ఆర్' సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాతో తారక్ క్రేజ్ పాన్ ఇండియా స్థాయికి పెరిగిపోనుంది. ఈ నేపథ్యంలో తన మార్కెట్ విస్తరించుకునే దిశగా తదుపరి సినిమాల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాడు. అయితే ఎందుకో ఆర్.ఆర్.ఆర్ తర్వాత ఎన్టీఆర్ చేయబోయే సినిమా విషయంలో క్లారిటీ మిస్ అయింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో హాసిని అండ్ హారిక ఎంటర్టైన్మెంట్ బ్యానర్ లో ఓ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు తారక్. మరికొన్ని రోజుల్లో సెట్స్ పైకి వెళ్తుందని అనుకుంటుండగా.. త్రివిక్రమ్ సినిమా లేదని క్లారిటీ ఇచ్చేసి.. కొరటాల శివతో సినిమా చేస్తున్నట్లుగా మరో క్లారిటీ ఇచ్చాడు. ఎన్టీఆర్ ఆర్ట్స్ - యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై పాన్ ఇండియా లెవల్ లో ఈ సినిమా రూపొందనుందని ప్రకటించారు. అయితే ఇప్పుడు మరో డైరెక్టర్ కి ఓకే చెప్పినట్లు టాక్ వినిపిస్తోంది. 'ఉప్పెన' సినిమాతో సక్సెస్ అందుకున్న దర్శకుడు బుచ్చిబాబు చెప్పిన లైన్ ఎన్టీఆర్ కి తెగ నచ్చేయడంతో సినిమా చేయడానికి అంగీకరించినట్లుగా ఫిలిం సర్కిల్స్ లో టాక్. బుచ్చిబాబు ప్రస్తుతం ఫైనల్ స్క్రిప్టును రెడీ చేసే పనిలో బిజీగా ఉన్నాడని.. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో ఈ సినిమా ఉంటుందని ప్రచారం జరుగుతోంది. దీంతో ట్రిపుల్ ఆర్ తరువాత ఎన్టీఆర్ నుంచి రాబోతున్న సినిమా మీద క్లారిటీ లేకుండా పోయింది. ఇకపోతే 'కేజీఎఫ్' దర్శకుడు ప్రశాంత్ నీల్ - కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ వంటి వారు కూడా ఎన్టీఆర్ తో సినిమాలు చేయడానికి స్క్రిప్టులు పట్టుకొని రెడీగా ఉన్నారు

## అందుకే ఇండియాకు రాను: పవర్ స్టార్ హీరోయిన్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన పులి(కొమరం పులి) సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయమైంది బ్రిటిష్ బ్యూటీ నికిషా పటేల్. ఈ వయ్యారికి తెలుగు సినిమాతో తన ఫిల్మ్ కెరీర్ ప్రారంభించింది. కానీ ఫస్ట్ మూవీ పెద్దగా ఫేమ్ తేకపోవడంతో వరుసగా సినిమాలు చేసుకుంటూ పోయింది. మొత్తానికి తెలుగు తమిళ కన్నడ మలయాళం భాషల్లో కలిపి దాదాపు 30 సినిమాలకు పైగా నటించింది. అలాగే పలు సినిమాలు ఇప్పుడు షూటింగ్ దశలో ఉన్నాయట. నికిషా ప్రస్తుతం ఆమె పేరెంట్స్ తో లండన్ లో ఉంటుంది. ఇండియాలో గతేడాది కరోనా లాక్డౌన్ మొదలవక ముందే నికిషా లండన్ కు వెళ్ళిపోయింది. అక్కడే పలు కమర్షియల్ యాడ్స్ చేసుకుంటూ బిజీగా ఉంటుందట. అయితే తాజాగా ఓ మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. నికిషా ఇప్పట్లో ఇండియాకు రానని తేల్చి చెప్పేసిందట. ఎందుకంటే ఇండియాలో కరోనా పరిస్థితి రోజురోజుకి భయంకరంగా మారుతుండటంతో ఆమె రానని చెప్పింది. అలాగే ప్రస్తుతం ఇండియాలో నికిషా ఫినిష్ చేయాల్సిన సినిమాలు చాలా ఉన్నాయని అవన్నీ ఫినిష్ చేయడానికి కరోనా ప్రభావం తగ్గిన వెంటనే వస్తానని చెప్పుకొచ్చింది. నికిషా కెరీర్ ప్రారంభించి పదేళ్లు దాటినా ఇంతవరకు ఏ భాషలో కూడా స్టార్ హీరోయిన్ స్టేటస్ అందుకోలేకపోయింది. అలాగే నేను ఇండియాకు ఇప్పట్లో రానంటే కొందరు సోమరి అంకితభావం లేదని కామెంట్ చేసారు. పర్లేదు అనుకోండి. ఎవరేమనుకున్నా ముందు ఆరోగ్యంగా ఉండటానికే ఇంపార్టెన్స్ ఇస్తానని చెబుతోంది. అయితే చివరిగా అమ్మడు నా ఫస్ట్ హోమ్ ఇండియానే అని చెప్పింది. అలాగే ఫస్ట్ టైం ఈ మధ్యకాలంలో పేరెంట్స్ తో వన్ ఇయర్ స్పెండ్ చేసానని చెబుతోంది. చూడాలి మరి త్వరలో ఏ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుందో..!

## యూవీ క్రియేషన్స్ బ్యానర్ లో నితిన్ సినిమా..?



యూత్ స్టార్ నితిన్ ఈ ఏడాది ఇప్పటికే రెండు సినిమాలు రిలీజ్ చేసి ఫుల్ స్పీడ్ లో ఉన్నారు. ప్రస్తుతం మేర్లపాక గాంధీ దర్శకత్వంలో "మ్యాస్ట్రో" అనే సినిమా చేస్తున్నాడు. ఇది హిందీలో సూపర్ హిట్ అయిన 'అంధాదున్' చిత్రానికి తెలుగు రీమేక్. రాజ్ కుమార్ ఆకెళ్ల సమర్పణలో శ్రేష్ఠ మూవీస్ బ్యానర్ పై ఎన్.సుధాకర్ రెడ్డి - నికిత రెడ్డిలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే జూన్ లోనే ఈ సినిమా విడుదల కానుంది. ఇకపోతే చైతన్య కృష్ణ దర్శకత్వంలో 'పవర్ పేట' అనే సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలుస్తోంది. ఈ క్రమంలో తాజాగా నితిన్ మరో ప్రాజెక్ట్ కి ఓకే చెప్పాడని టాక్ వినిపిస్తోంది. ఒకవైపు పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ మరోవైపు మీడియం రేంజ్ సినిమాలు తీస్తూ ఫుల్ ఫార్మ్ లో ఉన్న యూవీ క్రియేషన్స్ బ్యానర్ లో నితిన్ హీరోగా ఓ మూవీ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయట. అయితే ఈ ప్రాజెక్ట్ కి ఇంకా డైరెక్టర్ ఫిక్స్ అవ్వలేదని తెలుస్తోంది. 'యాత్ర' ఫేమ్ మహి వి. రాఘవ్ దర్శకత్వంలో ఉండొచ్చని అంటున్నారు. కాకపోతే మహి రాసుకున్న స్టోరీలో ఇద్దరు హీరోలు ఉంటారట. దొరికితే దొంగ దొరక్కపోతే దొర మాదిరి స్టోరీ లైన్ తో ఈ కథను మహి సిద్ధం చేసుకున్నాడట. మరి దీనికి నితిన్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి. మహి కాకపోతే వెంకీ కుడుముల లేదా మళ్ళీ మేర్లపాక గాంధీ లనే నితిన్ కోసం యూవీ టీమ్ సెట్ చేసే అవకాశాలు ఉన్నాయని టాక్ నడుస్తోంది.

## సోషల్ మీడియాలో పుష్పారాజ్.. స్టోరీ వైరల్!




టాలీవుడ్ స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ - స్టార్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో పుష్ప అనే పాన్ ఇండియా మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ మొదలైనప్పటి నుండి వార్తల్లో హాట్ టాపిక్ అవుతూనే ఉంది. అందుకు తగ్గట్టుగానే మేకర్స్ కూడా సినిమా నుండి అప్పుడప్పుడు అప్డేట్స్ పోస్టర్స్ రిలీజ్ చేస్తూనే ఉన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమా గురించి తాజాగా పలు కథనాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరి హీరో గురించా లేక హీరోయిన్ దర్శకుడు గురించా అనుకుంటే పొరపాటే. పుష్ప స్టోరీ గురించి సోషల్ మీడియాలో కథనాలు ఊహాగానాలు వ్యక్తం అవుతున్నాయి. మరి సినిమా కథ ఎలా ఉండబోతుందో కానీ ఈ రూమర్స్ మాత్రం జనాలను బాగానే అట్రాక్ట్ చేస్తున్నాయి. అయితే తాజాగా పుష్ప సినిమా కథ.. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కించిన విలన్ సినిమాకు కాపీ అని.. ఆ సినిమా కథనే స్ఫూర్తిగా తీసుకొని పుష్ప తెరకెక్కిస్తున్నారని టాక్ నడుస్తుంది. నిజానికి విలన్ సినిమా రామాయణం ఆధారంగా రావణ్ పాయింట్ ఆఫ్ వ్యూలో తెరకెక్కించారు. చెల్లిని చంపిన విలన్ ను హీరో ఎలా ఎదుర్కొన్నాడు అనేది కాన్సెప్ట్. మరి ఈ సినిమాలో కూడా పుష్పారాజ్ కు చెల్లి ఉంటుందని ఇదివరకే మేకర్స్ తెలిపారు. కానీ ఆ చెల్లి క్యారెక్టర్ ఐశ్వర్యరాజేష్ పోషిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. చూడాలి మరి ఈ సినిమాలో సుకుమార్ ఎలాంటి మ్యాజిక్ చూపిస్తాడో.. మరి నిజంగానే మణిరత్నం సినిమాను కాపీ కొట్టారా లేదా అనేది తెలియాలంటే ఖచ్చితంగా వెయిట్ చేయాల్సిందే. ప్రస్తుత సమాచారం ప్రకారం.. విలన్ మూవీకి పుష్ప కథకు ఎలాంటి పోలిక లేదని సినీవర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి రూమర్స్ చూసి సుకుమార్ టీమ్ నవ్వుకుంటున్నారట. ఈ సినిమాను మైత్రి మూవీస్ వారు నిర్మిస్తున్నారు.

## ఆ పరామర్శతో మనసు దోచిన బాలయ్య




నటసింహ నందమూరి బాలకృష్ణ షార్ట్ టెంపర్ గురించి కొన్నిసార్లు మీడియాలో కథనాలొచ్చాయి. కానీ ఆయనలోని మంచితనం గురించి అభిమానులతో కుశల ప్రశ్నల గురించి ఇతరులకు తెలిసింది తక్కువే. హీరో బాలకృష్ణ తన సీనియర్ అభిమాని కుమారుడు బళ్లారి బాలయ్య తో టెలిఫోన్ సంభాషణ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బళ్లారి బాలయ్య పరిచయం అవసరం లేదు. ఆయన.. ఆయన కుటుంబం దశాబ్దాలుగా నందమూరి కుటుంబానికి నమ్మకమైన అభిమానులు. వాస్తవానికి బళ్లాయ బ్యాలయ్య తన స్టైలిష్ లుక్ తో నే బోలెడంత పాపులారిటీ సంపాదించారు. బాలయ్య లెజెండ్ లుక్ తో అతడు కనిపించి అభిమానుల్ని మురిపించారు. దురదృష్టవశాత్తు బళ్లారి బాలయ్య గత ఉగాది నుంచి అనారోగ్యానికి గురయ్యాడు. అతను ఏప్రిల్ 26 న తుది శ్వాస విడిచాడు. ఆ రోజు సాయంత్రం బాలయ్య తన అభిమానుల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. బళ్లారి బాలయ్యకు భార్య ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు అందరూ వివాహం చేసుకున్నారు. బల్లయ్య బళ్లారి బాలయ్య కొడుకు. సంతాపం తెలపడమే గాక కష్టంలో వారికి అండగా నిలుస్తానని బాలయ్య హామీ ఇవ్వడం అందరి హృదయాలను గెలుచుకుంటోంది. బాలయ్యలో ఈ కొత్త కోణం అందరినీ ఆకట్టుకుంది.

## 'వకీల్ సాబ్' కాంబోలో మరో సినిమా లేనట్లేనా..?




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వాలని నిర్ణయించుకొని బ్యాక్ టూ బ్యాక్ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టాడు. దీంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయినప్పటికీ ముందుగా 'పింక్' రీమేక్ తో రావడం పట్ల నిరాశ చెందారు. అందులోనూ స్టార్ డైరెక్టర్ ని కాకుండా వేణు శ్రీరామ్ తో సినిమా కమిటవడం ఏంటని అందరూ ఆలోచించారు. అయితే 'వకీల్ సాబ్' విడుదలైన తర్వాత అభిమానుల అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. ఈ సినిమా విజయంలో కీలక పాత్ర పోషించిన వేణు శ్రీరామ్.. ఇందులో పవన్ ని ప్రజెంట్ చేసిన విధానానికి ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. దీంతో వేణు ని పొగడ్తలతో ముంచెత్తుతూ పవర్ స్టార్ తో మరో సినిమా చేయాలని కోరుకున్నారు. ఈ నేపథ్యంలో వేణు శ్రీరామ్ తో మరో సినిమా చేయడానికి పవన్ రెడీ అయ్యారని.. తన కోసం మరో కథ రెడీ చేయాల్సిందిగా స్వయంగా వేణుతో చెప్పినట్లుగా టాక్ వచ్చింది. దీనికి తోడు 'వకీల్ సాబ్' సక్సెస్ మీట్ లో వేణు మంచి స్క్రిప్ట్ రెడీ చేస్తే మరో ప్రాజెక్ట్ కోసం పవన్ కళ్యాణ్ ని కలుస్తామని దిల్ రాజు చెప్పారు. దీంతో పవన్ - వేణు కాంబోలో వెంటనే రెండో సినిమా ఉంటుందని.. వచ్చే ఏడాది సెట్స్ పైకి వెళ్తుందని వార్తలు వచ్చాయి. అయితే మనకందిన సమాచారం ప్రకారం ప్రస్తుతానికి పవన్ మరే కొత్త ప్రాజెక్ట్ కి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదట. ఇప్పటికే కమిట్ అయిన సినిమాలు పూర్తి చేసిన తర్వాతే కొత్తవాటి గురించి ఆలోచన చేస్తాడట. దీనిని బట్టి చూస్తే ఇప్పట్లో పవర్ స్టార్ - డైరెక్టర్ వేణు కాంబినేషన్ లో మరో సినిమా ఉండకపోవచ్చని సినీ వర్గాల్లో అనుకుంటున్నారు.

## తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకునేందుకు మరో ప్రయత్నం



టాలీవుడ్ లో 1980 90 సినిమాల్లో అత్యధికంగా కనిపించిన విలన్ రావు గోపాల్ రావు. విలనిజంకు మారు పేరు.. విలన్ గా అద్భుత నటన కనబర్చిన నటుడు రావు గోపాల్ రావు. ఆయన సాటి మరెవ్వరు లేరు అనడంలో సందేహం లేదు. ఆయన నట వారసుడిగా ఎంట్రీ ఇచ్చిన రావు రమేష్ కూడా విలక్షణ నటుడు అని పేరు తెచ్చుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. విలన్ గా క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఆయన చేసిన సినిమా ఇప్పటికే ఆయన మంచి నటుడిగా పేరు తీసుకు వచ్చాయి. ఆయన తండ్రి స్థాయిని అందుకోవడం కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకునేందుకు మహా సముద్రం సినిమాలో పెద్ద ప్రయోగమే చేయబోతున్నాడు. శర్వానంద్ హీరోగా సిద్దార్థ్ కీలక పాత్రలో నటిస్తున్న మహా సముద్రం సినిమా లో రావు రమేష్ చాలా విభిన్నంగా కనిపించబోతున్నాడట. కథ డిమాండ్ మేరకు రావు రమేష్ ను దర్శకుడు గూని వాడిగా చూపించబోతున్నాడట. రావు రమేష్ పాత్ర సినిమాకు ప్రత్యేకంగా నిలుస్తుందని అంటున్నారు. రావు రమేష్ ఈ పాత్రతో నటుడిగా మరో మెట్టును ఎక్కడం ఖాయం అంటున్నారు. వరుసగా సినిమాల్లో నటిస్తున్న రావు రమేష్ మూస పాత్రల్లో కనిపిస్తున్నాడు అని విమర్శించే వారికి ఈ పాత్ర సమాధానంగా నిలుస్తుందని ఆయన సన్నిహితులు అంటున్నారు. ఆర్ ఎక్స్ 100 సినిమా తో దర్శకుడిగా విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న అజయ్ భూపతి ఈ సినిమా కు దర్శకత్వం వహిస్తున్నాడు. దాదాపు రెండేళ్ల పాటు ఈ సినిమా స్క్రిప్ట్ పై వర్క్ చేశాడు. ప్రతి పాత్రను సన్నివేశంను అత్యంత జాగ్రత్తగా ప్లాన్ గా అజయ్ రెడీ చేశాడని అంటున్నారు. ఆర్ ఎక్స్100 సినిమాకు పూర్తి విభిన్నంగా ఉండే ఈ సినిమా చాలా ప్రత్యేకంగా ఉండి మాస్ ఆడియన్స్ తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ ను కూడా ఆకట్టుకుంటుందని అంటున్నారు. ఈ సినిమా లోని గూని వాడి పాత్ర తో రావు రమేష్ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకోవడం ఖాయం అంటూ మేకర్స్ నమ్మకంగా చెబుతున్నారు.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com